thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Karimnagar, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 33 | కరీంనగర్ | మంగళవారం | 21 ఏప్రిల్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

సన్ రైజర్స్ సత్తా...



11



## హర్మూజ్ దాటొద్దు

- భారత నౌకలకు నేవీ 'రెడ్ అలర్ట్'!
- ఇరాన్ కాల్పుల నేపథ్యంలో అడ్వైజరీ..
- అనుమతి వచ్చే వరకు నిలిపాలని ఆదేశం

హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలు పరాకాష్టకు చేరడంతో భారత నౌకాదళం (ఇండియన్ నేవీ) అత్యవసర హెచ్చరికలు జారీ చేసింది. భారత పతాకంతో ప్రయాణిస్తు న్న నౌకలపై ఇరాన్ బలగాలు కాల్పులు జరిపిన ఘటన ను తీవ్రంగా పరిగణించిన నేవీ, తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ఆ జలసంధి వైపు వెళ్లొద్దని నౌకలకు స్పష్టం చేసింది. ముఖ్యంగా లారక్ ఐలాండ్‌కు దూరంగా ఉండాలని సూచించింది. దేశ భద్రత మరియు వాణిజ్య ప్రయోజనాల దృష్ట్యా ఈ అడ్వైజరీ జారీ చేసినట్లు రక్షణ వర్గాలు వెల్లడిం చాయి. ఇటీవల 'జగ్ అర్ణవ్', 'సన్మార్ హెరాల్డ్' అనే రెండు భారత నౌకలు హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణి స్తుండగా ఇరాన్ బలగాలు వాటిని లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరిపాయి.

.. వివరాలు 3లో



## శాంతి చర్చల్లో ప్రతిష్టంభన

### చర్చలకు రావడం లేదని తేల్చిన ఇరాన్

4



## కేసీఆర్ ఖేల్ ఖతం

### వచ్చే ఎన్నికల్లో రా.. తేల్చుకుందాం

- కల్వకుంట్ల కుటుంబానికి కాలం చెల్లింది
- వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా కూడా దక్కదు
- కాళేశ్వరంలో లక్షకోట్లు మింగారు
- రైతు సంక్షేమం కాంగ్రెస్ విధానం
- రెండోవిడత రైతు భరోసా నిధులను విడుదల
- 2034 వరకు మళ్లీ కాంగ్రెస్‌దే అధికారం
- 2029లో నువ్వో.. నేనో తేల్చుకుందాం
- మహేశ్ గౌడ్, నా జోడీతో మళ్లీ అధికారం
- నస్తూర్‌పల్లి సభలో సీఎం రేవంత్ రెడ్డి

**జయశంకర్ భూపాలపల్లి, ఏప్రిల్ 20:** తెలంగాణ రాజకీయాల్లో మాటల యుద్ధం ముదిరి పాకాన పడింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన విమర్శలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత తీవ్రంగా స్పందించారు. కేసీఆర్ మళ్ళీ అధికారంలోకి వస్తానని భ్రమపడుతున్నారని, కానీ తెలంగాణలో ఆ కుటుంబం శకం శాశ్వతంగా ముగిసిపోయిందని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ చేసిన అవినీతి, అరాచక పాలనను ప్రజలు మర్చిపోలేదని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీని ఎలాగైతే తిరస్కరించారో, 2029 ఎన్నికల్లోనూ అదే ఫలితం పునరావృతం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు.

మిగతా 2 లో

### కాళేశ్వర ముక్తేశ్వరస్వామిని దర్శించుకున్న సీఎం

2

## మళ్లీ చీకటి రోజులు

### పునర్నిర్మాణానికి సిద్ధమవ్వండి



అధికారంలోకి రాగానే హైడ్రాను ఎత్తిపారేస్తాం..

మోసపూరిత హామీలపై ప్రజలు గోస | జగిత్యాల సభలో కేసీఆర్ గర్జన

### బీఆర్ఎస్‌లోకి సీనియర్ నేత జీవన్ రెడ్డి

### కీలక బాధ్యతలు అప్పగించిన అధినేత

**జగిత్యాల, ఏప్రిల్20:** తెలంగాణలో మళ్లీ ఉద్యమ నాటి పరిస్థితులు దాపురించాయని, పదేళ్ల పాటు వెలుగులీనిన రాష్ట్రం కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సర్వనాశనమైందని బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ధ్వజమెత్తారు. సోమవారం జగిత్యాలలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డికి కేసీఆర్ స్వయంగా గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తెలంగాణ పునర్నిర్మాణ మహాయజ్ఞంలో ప్రతి ఒక్కరూ

మిగతా 2 లో

## మేధావుల మౌనం సమాజానికి అరిష్టం

- డీలిమిటేషన్, మహిళా బిల్లుపై గళమెత్తా
- కాంగ్రెస్ కుట్రలను తిప్పికొట్టాలి
- అంబేద్కర్ ఆశయాలను అమలు చేస్తున్నది మోదీ ప్రభుత్వమే!
- కేంద్ర మంత్రి సంజయ్

దేశ పురోగతికి కీలకమైన డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన), మహిళా రిజర్వేషన్ బిల్లుల విషయంలో మేధావులు తమ మౌనాన్ని వీడాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. సమాజంలో జరుగుతున్న మంచి చెడులపై నిష్కర్షగా మాట్లాడాల్సిన బాధ్యత మేధావులపై ఉందని, వారి మౌనం సమాజానికి ఏమాత్రం శ్రేయస్కరం కాదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

3



## కాశ్మీర్‌లో ఘోర ప్రమాదం

### బస్సు బోల్తాపడి 15మంది మృతి

4



## రూ.100 కోసం హత్య

దంపతులపై దాడిలో భర్త మృతి

2





### దక్షిణ కొరియా ద్వైపాక్షిక సంబంధాలు బలోపేతం

4

అధ్యక్షుడు లీ జె మ్యూంగ్‌తో ప్రధాని నరేంద్ర మోదీ

## చెట్టును ఢీకొని కుప్పకూలిన ప్రైవేట్ జెట్

.. వివరాలు 2లో

ఇద్దరు పైలట్లు మృతి చెందినట్లు గుర్తింపు





### గడ్డపోతారం పారిశ్రామికవాడలో అగ్నిప్రమాదం

.. వివరాలు 2లో



# రూ.100 కోసం హత్య

**దంపతులపై దాడిలో భర్త మృతి**

**మంచిర్యాల, ఏప్రిల్ 20:** మంచిర్యాలలో దారుణం చోటుచేసుకుంది. అప్పు ఇవ్వలేదన్న కోపంతో ఓ వ్యక్తి ఘాతుకానికి ఒడిగట్టాడు. దంపతులపై కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో భర్త చనిపోగా.. భార్య పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే.. దండేపల్లి మండలం ముత్యంపేటకు చెందిన శంకరయ్య దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆదివారం ఓ వ్యక్తి దుకాణం దగ్గరకు వచ్చాడు. 100 రూపాయలు అప్పు ఇవ్వమని అడిగాడు. ఇందుకు శంకరయ్య ఒప్పుకోలేదు. దీంతో ఆ వ్యక్తి గొడవకు దిగాడు. గొడవ చిలికిచిలికి గాలివానలా మారింది. విచక్షణ కోల్పోయిన ఆ వ్యక్తి శంకరయ్యపై కత్తితో దాడి చేశాడు. అడ్డం వచ్చిన శంకరయ్య భార్యపై కూడా దాడి చేశాడు. దాడి అనంతరం అక్కడినుంచి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడ్డ శంకరయ్య దంపతులను స్థానికులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శంకరయ్య ప్రాణాలు విడిచాడు. ఆయన భార్య పరిస్థితి విషమంగా ఉంది. ఇక, సమాచారం అందుకున్న పోలీసులు ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నిందితుడి కోసం గాలిస్తున్నారు.

# 23 వరకు ఇంటర్ సప్లిమెంటరీ ఫీజు గడువు పొడిగింపు

**హైదరాబాద్, ఏప్రిల్ 20:** తెలంగాణలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు గడువును ఇంటర్మీడియట్ బోర్డు పొడిగించింది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరానికి చెందిన రెగ్యులర్ విద్యార్థులతో పాటు, ఫెయిలైన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాయడానికి ఈనెల 23వ తేదీ వరకు పొడిగించినట్లు తెలంగాణ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను నిర్వహించిన ఇంటర్ ప్రథమ, ద్వితీయ పరీక్షల ఫలితాలు ఈ నెల 12న విడుదలయ్యాయి. కాగా ఈ పరీక్షలో ఉత్తీర్ణులై మార్కులు ఎక్కువ సాధించాలని భావించే విద్యార్థులు, ఫెయిలైన విద్యారులకు మే 13 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. మే 22 నుంచి 25 వరకు ప్రాక్టికల్స్, మే 26న ఫస్టియర్, సెకండియర్ ఇంగ్లిష్ ప్రాక్టికల్స్, 28న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష, ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్ష నిర్వహించనున్నారు.

# ఢిల్లీకి బీఆర్ఎస్ బృందం

**కాళేశ్వరంపై న్యాయవాదులతో సంప్రదింపులు**

**హైదరాబాద్, ఏప్రిల్ 20:** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు పార్టీ త్రిసభ్య కమిటీ దిల్లీ పర్యటనకు వెళ్లింది. ఈ ప్రతినిధుల బృందంలో మాజీ మంత్రి హరీశ్ రావు, మాజీ ఎంపీ వినోద్ కుమార్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఉ న్నారు. ఏప్రిల్ 22న తెలంగాణ హైకోర్టులో కాళేశ్వరం కమిషన్‌పై తుది తీర్పు వెలువడనుంది. అలాగే ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసు నేపథ్యంలో తదుపరి న్యాయపరమైన కార్యాచరణను సిద్ధం చేసేందుకు వీరి దిల్లీ పర్యటనకు వెళ్లారు. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులతో ఈ కమిటీ ప్రత్యేకంగా సమావేశమైంది. కాళేశ్వరం కమిషన్‌పై హైకోర్టు తీర్పు వచ్చిన తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశాలపై.. అలాగే ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసులో న్యాయపరంగా తీసుకోవాల్సిన తదుపరి చర్యలపై లాయర్లతో చర్చిస్తున్నారు.

# చెట్టును ఢీకొని కుప్పకూలిన ప్రైవేట్ జెట్

**ఇద్దరు పైలట్లు మృతి చెందినట్లు గుర్తింపు**

**రాయపూర్, ఏప్రిల్ 20:** ఛత్తీస్‌గఢ్‌లోని జశ్‌పుర్ జిల్లా కొండ ప్రాంతంలో ప్రైవేటు జెట్ ఒకటి సోమవారంనాడు కుప్పకూలింది. ఆరా హిల్స్‌లో తొలుత చెట్టును ఢీకొని ఆ తర్వాత కుప్పకూలినట్టు స్థానికులు తెలిపారు. దీంతో మంటలు ఎగసిపడి పొగ చుట్టుపక్కలకు వ్యాప్తించినట్టు తెలుస్తోంది. ఈ ప్రమాదంలో జెట్‌లోని పైలట్, కో-పైలట్ ఇద్దరూ మరణించినట్టు ప్రాథమిక సమాచారం. జెట్ కుప్పకూలిన సమయంలో అందులో ఇంకెవరైనా ఉన్నారా అనేది తెలియాల్సి ఉంది. జెట్ కుప్పకూలిన సమాచారం తెలిసిన వెటనే ఎస్ఎస్‌పీ లాల్ ఉమిద్ సింగ్ సహా సీనియర్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని సహాయక కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు. ఈ ప్రమాదానికి సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది.

# గడ్డపోతారం పారిశ్రామికవాడలో అగ్నిప్రమాదం

**ఎరిత్రో ఫార్మా పరిశ్రమలో రియాక్టర్ పేలుడు**

**సంగారెడ్డి, ఏప్రిల్ 20:** సంగారెడ్డి జిల్లాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. గడ్డపోతారం పారిశ్రామికవాడలో ఉన్న ఎరిత్రో ఫార్మా పరిశ్రమలో అకస్మాత్తుగా రియాక్టర్ పేలుడు సంభవించింది. ఈ ఘటనతో ఒక్కసారిగా మంటలు పరిసర ప్రాంతాలను ఆవరించాయి. పేలుడు తీవ్రత ఎక్కువగా ఉండటంతో సమీప ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. దట్టమైన పొగ పరిశ్రమ పరిసరాల్లో వ్యాపించింది.సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేసే ప్రయత్నాలు ప్రారంభించారు. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పల్గ ÷ర్ ఇంజిన్లు రంగంలోకి దిగాయి. పేలుడు కారణంగా ఎవరైనా గాయపడినారా లేదా అన్నది ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. పేలుడు ఎలా జరిగింది, రియాక్టర్‌లో ఏవైనా సాంకేతిక లోపాలున్నాయా అనే దానిపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. పరిశ్రమలో భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా? లేదా అనే అంశంపైనా కూడా విచారణ జరుగుతోంది. ఈ ఘటనతో గడ్డపోతారం పారిశ్రామికవాడలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అధికారులు ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



# కేసీఆర్ ఖేల్ ఖతం

మొదటి పేజీ తరువాయి

పెద్ద పెద్ద ప్రాజెక్టులు కట్టి రైతులకు నీరిచ్చింది కాంగ్రెస్ పార్టీ అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పంటలకు గిట్టుబాటు ధర ఇచ్చే చట్టాన్ని తీసుకొచ్చిందని గుర్తు చేశారు. ప్రజాపాలనలో రైతు ఉత్సవాల పేరుతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం నస్తూర్‌పల్లిలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో సీఎం పాల్గొన్నారు. సభావేదిక పైనుంచి రెండోవిడత రైతు భరోసా నిధులను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోనే రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చిన తొలిపార్టీ కాంగ్రెస్ అని అన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించి ఏడాదిలోపే చేసి చూపించాం. 25.35 లక్షల మంది రైతుల ఖాతాల్లో రుణమాఫీ కింద రూ.22 వేల కోట్లు వేశాం. గత విడతలో రైతుభరోసా కింద 9 రోజుల్లోనే రూ.9 వేల కోట్లు వేశాం. ఇవాళ రెండో విడతగా రూ.5,700 కోట్లకుపైగా రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నాం. మిగతా రూ.3,300 కోట్లు వచ్చే నెలలో రైతుల ఖాతాల్లో వేస్తాం. రాష్ట్రంలో 3.5 కోట్ల మంది పేదలకు సన్నబియ్యం ఇస్తున్నాం. పేదలకు సన్న బియ్యం ఇవ్వాలనే ఆలోచన గతంలో ఎవరికైనా వచ్చిందా? అన్నారు. గతంలో వైఎస్ఆర్- డి.శ్రీనివాస్ జోడీ కాంగ్రెస్‌ను వరుసగా ఎలా గెలిపించిందో, ఇప్పుడు తాను, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కలిసి రెండోసారి కాంగ్రెస్‌ను విజయతీరాలకు చేరుస్తామని ఆయన శపథం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే సుప్రీం అని, వారిచ్చిన తీర్పును గౌరవించకుండా కేసీఆర్ ఇంకా అహంకారంతో మాట్లాడటం ఆయన భ్రమలకు నిదర్శనమని రేవంత్ మండిపడ్డారు. కేసీఆర్ వ్యాఖ్యలు 'చిల్లర మాటలు' అంటూ కొట్టిపారేసిన సీఎం, రాష్ట్ర ప్రజలు కల్వకుంట్ల కుటుంబాన్ని ఎప్పటికీ క్షమించరని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులే తమను మళ్లీ గెలిపిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీకి కాలం చెల్లిందని, ఇకపై తెలంగాణ గడ్డపై కాంగ్రెస్ హవా మాత్రమే కొనసాగుతుందని రేవంత్ రెడ్డి కార్యకర్తల సాక్షిగా ప్రకటించారు. విపక్షాల విమర్శలకు తాము చేసే అభివృద్ధే సమాధానం చెబుతుందని, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. రైతు భరోసా రెండో విడత నిధులను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విడుదల చేశారు. 40 లక్షల మంది రైతులకు రైతు భరోసా ఇస్తున్నామని స్పష్టం చేశారు. రైతు సంక్షేమం.. కాంగ్రెస్ నినాదమే కాదు, విధానమని ఉ ద్ఘాటించారు. పంటలకు గిట్టుబాటు ధర తీసుకొచ్చిందే కాంగ్రెస్ అని వ్యాఖ్యానించారు. వరికి రూ.500 బోనస్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని నొక్కిచెప్పారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పర్యటించారు. అక్కడ ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌కు ప్రతిపక్ష హోదా కూడా ఊడగొడతామని హెచ్చరించారు. కాళేశ్వరంలో రూ.లక్ష కోట్లు ముంచారని ఆగ్రహించారు. కేసీఆర్‌కు ఉరి వేసినా తప్పులేదని హెచ్చరించారు. వరుస ఎన్నికల విజయంతో ఆయనకు ఘోరీ కట్టామని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో తేల్చుకుందాం.. దమ్ముంటే రావాలని సవాల్ విసిరారు. ప్రజాపాలనో.. పాపాల భైరవుడో తేల్చుకుందామని వార్నింగ్ ఇచ్చారు. బీఆర్ఎస్ ఘోరీపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. 2034 వరకు కాంగ్రెస్ పాలన కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యకర్తల సాక్షిగా ఇదే తన సవాల్ అని పేర్కొన్నారు. ప్రజాపాలన ఎందుకు పోవాలో మాజీ మంత్రి జీవన్‌రెడ్డి చెప్పాలని ప్రశ్నించారు. పేదలకు సన్నబియ్యం ఇస్తున్నందుకు ప్రజాపాలన పోవాలా? అని నిలదీశారు. కేసీఆర్ డబుల్ బెడ్‌రూమ్ ఇళు ఇచ్చారా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. కేసీఆర్ హయాంలో రూ.20 లక్షల కోట్లు ఖర్చు చేశారు కానీ 20 వేల ఇళ్లు కూడా ఎందుకు కట్టలేదని నిలదీశారు. 4.5 లక్షల ఇళ్లు ఇచ్చినందుకు ప్రజాపాలన పోవాలా? అని ప్రశ్నించారు. జీవన్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వనందుకు ప్రజాపాలన పోవాలా? అని నిలదీశారు. ప్రజాపాలన



పోవాలి.. పాపాల భైరవుడు రావాలని జీవన్‌రెడ్డి అంటున్నారని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజలు గడీల పాలన పోవాలనే కాంగ్రెస్ పాలన తెచ్చుకున్నారని ప్రస్తావించారు. జీవన్‌రెడ్డి మాజీ సీఎం ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి నాదెండ్లతో జతకట్టారని విమర్శించారు. జగిత్యాల కాంగ్రెస్ కార్యకర్తలు జీవన్‌రెడ్డిని పల్లకీపై మోశారని ప్రస్తావించారు. తమ ప్రభుత్వం గడీలకు ఊడిగం చేయాలా? అని ప్రశ్నించారు. గతంలో ఆడబిడ్డలు బతుకమ్మ చీరలు కట్టి పండుగ చేసుకున్నారా? అని నిలదీశారు. కేసీఆర్ హయాంలో పేదలకు సన్నబియ్యం ఇవ్వాలని ఎప్పుడైనా ఆలోచించారా..? అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నల వర్షం కురిపించారు. వాస్తు బాగా లేదని బాగున్న సచివాలయం కూల్చి కొత్తగా కట్టుకున్నారు. బిడ్డ, కొడుకు, తండ్రి ఇలా తలో ఫామ్‌హౌస్ కట్టుకున్నారు. పేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వాలనే ఆలోచన ఏనాడైనా వచ్చిందా?పేదలు.. దొరల గడీల ముందు ఊడిగం చేస్తూ అలాగే ఉండాలని భావించారు. పేదలు కట్టుకోవడానికి పనికిరాని బతుకమ్మ చీరలు పంచారు. వేములవాడకు రూ.100 కోట్లు ఇస్తానని ప్రకటించి.. పదేళ్లలో ఒక్క రూపాయి ఇవ్వలేదు. కేసీఆర్.. నీ ప్రతిపక్ష హోదా ఊడగొట్టకపోతే నా పేరు మార్చుకుంటా. కార్యకర్తల సాక్షిగా ఇదే నా సవాల్. 2029లో నువ్వో.. నేనో తేల్చుకుందాం' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

# కాళేశ్వర ముక్తేశ్వరస్వామిని దర్శించుకున్న సీఎం

**కాళేశ్వరం విస్తరణకు రేవంత్ శంకుస్థాపన**

**రూ.198 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులకు శ్రీకారం**



**జయశంకర్ భూపాలపల్లి, ఏప్రిల్ 20:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా పర్యటనకు వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి కాళేశ్వరంలోని కాళేశ్వర ముక్తేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం రూ.198 కోట్లతో చేపట్టబోయే ఆలయ అభివృద్ధి పనులకు సీఎం భూమిపూజ చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన దక్షిణ కాశీగా పేరుగాంచిన కాళేశ్వరంలోని శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అభివృద్ధి , మేడిగడ్డ బ్యారేజ్ పునరుద్ధరణ పనులపై ఈ పర్యటనలో ఆయన ప్రధానంగా దృష్టి సారించారు. కాళేశ్వరం చేరుకున్న ముఖ్యమంత్రికి ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. రేవంత్ రెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం, ఆలయ ప్రాంగణంలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఆయన భూమి పూజ చేశారు. భక్తుల సౌకర్యార్థం కాళేశ్వరం క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ఈ సందర్భంగా ప్రభుత్వం సూచనప్రాయంగా వెల్లడించింది. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, గడ్డం వివేక్ తదితరులు పాల్గొన్నారు. ఆలయ దర్శనం అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేరుగా మేడిగడ్డ బ్యారేజ్ వద్దకు చేరుకున్నారు. గత కొంతకాలంగా వివాదాస్పదంగా మారిన మేడిగడ్డ బ్యారేజ్ కుంగుబాటు, ప్రస్తుత స్థితిగతులు , పునరుద్ధరణ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బ్యారేజ్ మరమ్మత్తులు ఎంతవరకు వచ్చాయి, వర్షాకాలం లోపు చేపట్టాల్సిన రక్షణ చర్యల గురించి ఇంజనీరింగ్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై గత ప్రభుత్వంపై విమర్శలు చేసిన నేపథ్యంలో, స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి మేడిగడ్డను సందర్శించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రాజెక్టు భద్రత , భవిష్యత్తు కార్యాచరణపై ఈ పర్యటన ద్వారా ఆయన అధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు. సీఎం పర్యటన దృష్ట్యా పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలు , ఉన్నతాధికారులు ఈ పర్యటనలో ముఖ్యమంత్రి వెంట ఉన్నారు.

# రేవంత్‌తో నార్వే బృందం భేటీ

**హైదరాబాద్, ఏప్రిల్ 20:** రేవంత్ రెడ్డిని నార్వే రాయబారి హెచ్.ఈ. మే-ఎలిన్ స్టైనర్ ప్రతినిధి బృందం కలిసింది. జూబ్లీ హిల్స్ నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసినట్లు తెల పింది. ఈ సందర్భంగా తెలం గాణ అభివృద్ధి, పెటటుబడులు తదితర పలు అంశాలు ప్రస్తావనకు వచ్చాయి.





# మళ్లీ చీకటి రోజులు..

మొదటి పేజీ తరువాయి

భాగస్వాములు కావాలని, రాష్ట్ర ప్రయోజనాల కోసమే జీవన్ రెడ్డి తనతో చేతులు కలిపారని కేసీఆర్ ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో ప్రజలను నిలువునా వంచించిందని కేసీఆర్ మండిపడ్డారు. "రెండేళ్లయినా ఒక్క నిర్మాణాత్మక పని చేయలేదు. ప్రాజెక్టులను పడావు పెట్టారు, మిషన్ భగీరథను మూలన పడేశారు. ఎరువుల బస్తాల కోసం చెప్పులు క్యూలో పెట్టే దుస్థితి మళ్లీ వచ్చింది" అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో తాము ఎంతో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసిన రాష్ట్రాన్ని కాంగ్రెస్ పాలకులు అధ్వానంగా మార్చారని, కరెంటు ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందని విమర్శించారు. రైతులు, ఉద్యోగులు, నిరుద్యోగులు ఇలా ప్రతి వర్గం నేడు గోస పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

**హైడ్రాపై తొలి సంతకం.. మూసీ కూల్చివేతలపై నిప్పులు**

హైదరాబాద్‌లో పేదల ఇళ్లను కూల్చివేస్తున్న 'హైడ్రా'పై కేసీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "మేము అధికారంలోకి రాగానే హైడ్రాను ఎత్తిపారేస్తాం.. దానిపైనే నా తొలి సంతకం ఉంటుంది. మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇళ్లను కూల్చే హక్కు మీకెవరిచ్చారు?" అని నిలదీశారు. ఈ ప్రభుత్వం చేసేది ప్రజాపాలన కాదు, రియల్ ఎస్టేట్ వ్యాపారమని ఆరోపించారు. కేంద్రానికి మోకరిల్లి వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టేందుకు సిద్ధమవుతున్నారని, దీనిపై తాము రాజీలేని యుద్ధం చేస్తామని హెచ్చరించారు. సీఎం రేవంత్ రెడ్డి పేరు ఎత్తకుండానే, తన మరణాన్ని కోరుకుంటున్న వారిపై కేసీఆర్ సెటైర్లు వేశారు. "కేసీఆర్ చావాలి అని శాపనార్థాలు పెడుతున్నారు. పిల్లి శాపాలకు ఉట్లు తెగుతాయా? నేను వెయ్యి జన్మలెత్తినా చావను, నా చివరి శ్వాస వరకు తెలంగాణ కోసం పనిచేస్తూనే ఉంటాను" అని స్పష్టం చేశారు. జగిత్యాలలో తాను సభ పెడుతున్నానని తెలిసి రెండో విడత రైతు భరోసా విడుదల చేశారని, తాము మళ్లీ సభ పెడితేనే మూడో విడత ఇస్తారా అని ఎద్దేవా చేశారు.

**జీవన్ రెడ్డికి కీలక బాధ్యతలు**

45 ఏళ్ల స్నేహితుడైన జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరడం పార్టీకి కొత్త ఊపునిచ్చిందని కేసీఆర్ అన్నారు. ఆయనను బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తున్నట్లు ప్రకటించారు. ఉమ్మడి కరీంనగర్, పొరుగు జిల్లాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, అప్పుడు జీవన్ రెడ్డికి అత్యున్నత బాధ్యతలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ ముఖ్య నేతలు, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



# మేధావుల మౌనం సమాజానికి అరిష్టం

- డీలిమిటేషన్, మహిళా బిల్లుపై గళమెత్తాలి..
- కాంగ్రెస్ కుట్రలను తిప్పికొట్టాలి
- అంబేద్కర్ ఆశయాలను అమలు చేస్తున్నది మోదీ ప్రభుత్వమే!
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్



**కరీంనగర్:** దేశ పురోగతికి కీలకమైన డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన), మహిళా రిజర్వేషన్ బిల్లుల విషయంలో మేధావులు తమ మౌనాన్ని వీడాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. సమాజంలో జరుగుతున్న మంచి చెడులపై నిష్కర్షగా మాట్లాడాల్సిన బాధ్యత మేధావులపై ఉందని, వారి మౌనం సమాజానికి ఏమాత్రం శ్రేయస్కరం కాదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా కరీంనగర్‌లోని శుభమంగళ కన్వెన్షన్‌లో నిర్వహించిన 'మేధావుల సదస్సు'లో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. అంబేద్కర్ కేవలం ఒక వర్గానికో, పార్టీకో పరిమితమైన నాయకుడు కాదని, అణగారిన వర్గాల వెలుగురేఖ అని బండి సంజయ్ కొనియాడారు. "అంబేద్కర్ బీజేపీ నాయకుడు కాకపోయినా, ఆయన ఆశయాలను గల్లీగల్లీకి తీసుకెళ్తున్నది మోదీ ప్రభుత్వమే. చాయ్ వాలా ప్రధాని అయ్యారంటే అది అంబేద్కర్ పెట్టిన భిక్ష అని మోదీ గారే స్వయంగా ప్రకటించారు" అని గుర్తు చేశారు. అంబేద్కర్ జన్మించిన, చదువుకున్న, నివసించిన ప్రాంతాలను 'పంచ తీర్థాలు'గా అభివృద్ధి చేసి గౌరవించింది బీజేపీ ప్రభుత్వమేనని ఆయన స్పష్టం చేశారు. చరిత్రలో అంబేద్కర్‌ను అడుగడుగునా అవమానించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని బండి సంజయ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "ఆర్టికల్ 370ని అంబేద్కర్ వ్యతిరేకిస్తే నెహ్రూ బలవంతంగా రుద్దారు. హిందూ కోడ్ బిల్లు ద్వారా మహిళలకు ఆస్తి హక్కు, రిజర్వేషన్లు కల్పించాలని కోరితే కాంగ్రెస్ అడ్డుకుంది. చివరకు ఆయనను పార్లమెంటుకు వెళ్లకుండా కుట్ర చేసి ఓడించారు. ఆయన మరణిస్తే అంత్యక్రియలకు ఢిల్లీలో రెండు గజాల స్థలం కూడా ఇవ్వని నీచ చరిత్ర కాంగ్రెస్ ది" అని మండిపడ్డారు. నెహ్రూ, ఇందిరా గాంధీలు తమకు తాము భారతరత్న ఇచ్చుకున్నారని, కానీ అంబేద్కర్‌కు బీజేపీ మద్దతు ఉన్న ప్రభుత్వమే ఆ గౌరవాన్ని దక్కించిందని గుర్తు చేశారు. మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ బిల్లులు అంబేద్కర్ ఆలోచనల్లో భాగమేనని, వీటిని అమలు చేయడానికి మోదీ ప్రభుత్వం సిద్ధంగా ఉంటే కాంగ్రెస్ కూటమి అడ్డుకుంటోందని బండి సంజయ్ ఆరోపించారు. "సోనియా, ప్రియాంక, కనిమొళి, సుప్రియా సూలె వంటి వారసత్వ నాయకులకు పదవులు దక్కితేనే మహిళలకు న్యాయం జరిగినట్లా? సామాన్య మహిళలు చట్టసభల్లో అడుగుపెట్టకూడదా?" అని నిలదీశారు. సీట్లు పెంచితే దక్షిణాది రాష్ట్రాలకు అదనపు ప్రాతినిధ్యం దక్కుతుందని, కొత్త రక్తం రాజకీయాల్లోకి వస్తుందని ఆయన వివరించారు. రాజకీయాలతో సంబంధం లేకుండా సమాజ హితం కోరే మేధావులు, డీలిమిటేషన్ మరియు మహిళా బిల్లు వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని కేంద్ర మంత్రి కోరారు. సోషల్ మీడియా, సదస్సుల ద్వారా ప్రజల్లో చైతన్యం తేవాలని చేతులెత్తి విన్నవించారు. అట్టడుగు వర్గాలకు ఆర్థిక, సామాజిక సమానత్వం దక్కేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్న మోదీ ప్రభుత్వానికి అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సదస్సులో కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, దళిత మోర్చా అధ్యక్షులు సోమిడి వేణు, పలువురు మేధావులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



## నీది వ్యభిచార కొంపనా?

### అక్రమ సంపాదనతోనే అహంకారం

### వెలమల ఆత్మగౌరవంపై దాడి : కేటీఆర్ వ్యాఖ్యలపై సంజయ్ నిప్పులు

**జగిత్యాల, ఏప్రిల్ 20:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తనను 'క్రాస్ బ్రీడ్' అనడంపై జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సంజయ్ తీవ్రంగా మండిపడ్డారు. కేటీఆర్ వ్యాఖ్యలు ఆయన అక్రమ సంపాదనతో వచ్చిన అహంకారానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. రాజకీయ వ్యభిచారం గురించి మాట్లాడే హక్కు కేటీఆర్‌కు లేదని, గతంలో ఇతర పార్టీల ఎమ్మెల్యేలను బీఆర్ఎస్ లో చేర్చుకున్నప్పుడు ఈ నీతులు ఎటుపోయాయని నిలదీశారు. తాను రాజకీయ వ్యభిచారిని అయితే, మరి కేటీఆర్ వ్యభిచార కొంప నడుపుతున్నారా అని సంజయ్ ప్రశ్నించారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో సొంత పార్టీ అభ్యర్థిని కాదని క్రాస్ ఓటింగ్ చేయించింది కేటీఆర్ కాదా అని అడిగారు. కల్వకుంట్ల కుటుంబ అహంకారం వల్లే రాష్ట్రంలో వెలమ జాతి గౌరవం తగ్గుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేటీఆర్ రాజకీయాల్లోకి రాకముందే తమ కుటుంబం రాజకీయాల్లో ఉందని సంజయ్ గుర్తుచేశారు. ఎమ్మెల్యే అయ్యాక తన ఆస్తులు తగ్గాయే తప్ప పెరగలేదని స్పష్టం చేశారు. అక్రమంగా సంపాదించిన సొమ్ముతో కేటీఆర్ ఇలాంటి విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. తమ కుటుంబ చరిత్ర తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు.

# అజహర్ ఎమ్మెల్సీ ఫైల్‌కు గవర్నర్ బ్రేక్?

### పాత కేసులే ఆమోదానికి అడ్డంకి



### న్యాయ నిపుణుల సమీక్షకు పంపిన గవర్నర్

- ఏప్రిల్ 30తో ముగియనున్న 6 నెలల గడువు
- మంత్రి పదవి ఊడుతుందనే ఆందోళనలో కాంగ్రెస్
- కోదండరాం పేరుకు లైన్ క్లియర్ అయ్యే ఛాన్స్

**హైదరాబాద్, ఏప్రిల్ 20 :** మంత్రి అజహరుద్దీన్ భవితవ్యం ఇప్పుడు గవర్నర్ నిర్ణయంపైనే ఆధారపడి ఉంది. మంత్రిగా కొనసాగాలంటే ఈ నెల 30లోగా ఆ యన ఎమ్మెల్సీగా ప్రమాణం చేయాల్సి ఉంది. గవర్నర్ కోటాలో ఆయన పేరును ప్రభుత్వం సిఫార్సు చేసినా.. రాజ్‌భవన్ నుంచి ఇంకా ఆమోద ముద్ర పడలేదు. గడువు ముగుస్తున్న తరుణంలో గవర్నర్ అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండటంతో రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. అజహర్ నామినేషన్ ఆమోదించడానికి గవర్నర్ శివప్రతాప్ శుక్లా వెనకాడుతున్నట్లు సమాచారం. గతంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు జరిగిన ఆర్థిక అవకతవకలే దీనికి ప్రధాన కారణం. సుమారు 3.8 కోట్ల రూపాయల కుంభకోణానికి సంబంధించి ఆయనపై ఏసీబీ కేసులు, ఈడీ విచారణలు ఉన్నాయి. ఈ కేసుల్లో ఛార్జ్ షీట్ కూడా నమోదైనట్లు గవర్నర్ కార్యాలయం గుర్తించింది. నేరారో పణలు ఉన్న వారిని నామినేట్ చేయడంపై గవర్నర్ ఆచి తూచి అడుగులు వేస్తున్నారు. అజహర్ పై ఉన్న కేసుల తీవ్రతను బట్టి గవర్నర్ ఈ ఫైల్‌ను న్యాయ నిపుణుల సమీక్షకు పంపారు. ఆర్థిక నేరాల ఆరోపణలు ఉన్న వ్యక్తిని నేరుగా ఎమ్మెల్సీగా నియమించడంపై ఉన్న చట్టపరమైన సాధ్యా సాధ్యాలను పరిశీలిస్తున్నారు. మరోవైపు కోదండరాం పేరు పై గవర్నర్ సానుకూలంగా ఉన్నట్లు సమాచారం. అయితే ఇద్దరి పేర్లను ఒకేసారి ఆమోదించాలా లేక అజహర్ ఫైల ను పక్కన పెట్టి కోదండరాం పేరునే ఖరారు చేయాలా అనే సందిగ్ధత నెలకొంది. గడువు సమీపిస్తుండటంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగారు. ఆదివారం గవర్నర్‌ను కలిసి అజహర్, కోదండరాం పేర్లను తక్షణమే ఆమోదించాలని కోరారు. ప్రభుత్వం తరపున పూర్తి వివరణ ఇచ్చినా గవర్నర్ ఇంకా స్పష్టత ఇవ్వలేదు. ఒకవేళ ఏప్రిల్ 30లోగా ఆమోదం రాకపోతే అజహర్ మంత్రి పదవికి రాజీనామా చేయక తప్పని పరిస్థితి ఏర్ప డుతుంది. ప్రస్తుతం ఈ బంతి గవర్నర్ కోర్టులోనే ఉంది.

## ఢిల్లీకి బీఆర్ఎస్ త్రిసభ్య కమిటీ

### హరీష్ రావు నేతృత్వంలో పర్యటన

### సుప్రీంకోర్టు న్యాయవాదులతో భేటీ



**హైదరాబాద్, ఏప్రిల్ 20:** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు పార్టీకి చెందిన త్రిసభ్య కమిటీ ఢిల్లీకి చేరుకుంది. ఈ బృందంలో మాజీ మంత్రి హరీష్ రావు, మాజీ ఎంపీ వినోద్ కుమార్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఉన్నారు. రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ, న్యాయపరమైన అంశాలపై సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులతో చర్చించడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశం. ఏప్రిల్ 22న తెలంగాణ హైకోర్టులో కాళేశ్వరం కమిషన్ పై తుది తీర్పు వెలువడనుంది. ఈ నేపథ్యంలో తీర్పు ఒకవేళ వ్యతిరేకంగా వస్తే సుప్రీంకోర్టును ఆశ్రయించే అంశాలపై కమిటీ చర్చిస్తోంది. దీనితో పాటు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లోకి చేరిన ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసులో అనుసరించాల్సిన న్యాయ వ్యూహాలపై లాయర్లతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఢిల్లీలో మకాం వేసిన బీఆర్ఎస్ నేతలు నిరంతరం న్యాయ నిపుణులతో భేటీ అవుతున్నారు. హైకోర్టు తీర్పు తర్వాత చేపట్టాల్సిన తదుపరి చర్యలపై ఇప్పటికే ఒక స్పష్టతకు వచ్చినట్లు తెలుస్తోంది. పార్టీ కీలక నేతలు ఢిల్లీ పర్యటనలో ఉండటంతో రాష్ట్ర రాజకీయాల్లో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది.

## జీవన్ రెడ్డి ఒక్కరోజే వీఐపీ

### మునిగే పడవలో మాజీ ఎమ్మెల్యే: ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్, ఏప్రిల్ 20:** బీఆర్ఎస్ భవిష్యత్తు అంధకారమని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. జీవన్ రెడ్డి ఆ పార్టీలో ఒక్కరోజు వీఐపీ మాత్రమేనని ఎద్దేవా చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. బీఆర్ఎస్ మునిగిపోయే పడవని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్‌లో ముసలం మొదలైందని చామల పేర్కొన్నారు. జీవన్ రెడ్డి ఇంటికి కేటీఆర్ వెళ్లినప్పుడు హరీష్ రావు వెళ్లలేదని గుర్తుచేశారు. కేసీఆర్ ఫామ్ హౌస్ నుంచి బయటకు వస్తుంటే.. హరీష్ రావు ఢిల్లీకి ఎందుకు వెళ్లారో చెప్పాలని డిమాండ్ చేశారు. కవిత ఇప్పటికే సొంత పార్టీ పెట్టుకున్నారని ఆరోపించారు. హరీష్ రావు ఢిల్లీలో ఎవరిని కలిశారో త్వరలోనే బయటపడుతుందని ఎంపీ అన్నారు. సొంత పార్టీ నేతలే జీవన్ రెడ్డి చేరికను ఇష్టపడటం లేదని తెలిపారు. మునిగే పడవలో చేరి ఆయన ఏం సాధిస్తారని ప్రశ్నించారు. సీనియర్ల పరిస్థితి ఆ పార్టీలో ఎలా ఉంటుందో అందరికీ తెలుసని చామల విమర్శించారు.

## రేవంత్ సభపై కేసీఆర్ కుట్ర

### కావాలనే పోటీ సభలు పెట్టిన బీఆర్ఎస్

### ఫామ్ హౌస్ కే పరిమితమైన పులి

### పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్



**హైదరాబాద్, ఏప్రిల్ 20:** సీఎం రేవంత్ రెడ్డి రైతు సభకు పోటీగానే కేసీఆర్ జగిత్యాల సభ ఏర్పాటు చేశారని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. రేవంత్ సభ 20 రోజుల ముందే ఖరారైందని ఆయన గుర్తు చేశారు. కేసీఆర్ కు అబద్ధాలు చెప్పడం, ప్రజలను మభ్యపెట్టడం అలవాటేనని విమర్శించారు. జీవన్ రెడ్డికి కేసీఆర్ మాయమాటలు చెబుతున్నారని మహేష్ గౌడ్ ఎద్దేవా చేశారు. గతంలో కేసీఆర్ చేసిన మోసాలను మాకు పాఠాలుగా చెప్పిన జీవన్ రెడ్డి.. ఇప్పుడు అదే పార్టీకి వత్తాసు పలకడం విడ్డూరంగా ఉందన్నారు. కేకే, డీఎస్ లాగే జీవన్ రెడ్డి కూడా భవిష్యత్తులో బాధపడతారని వ్యాఖ్యానించారు. కేసీఆర్ అనే పులి ఇప్పుడు ఫామ్ హౌస్ కే పరిమితమైందని మహేష్ గౌడ్ దుయ్యబట్టారు. ప్రాజెక్టుల పేరుతో ప్రజలను దోచుకున్న వారి వివరాలను త్వరలోనే బయటపెడతామని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి పాలనను ప్రజలు కోరుకుంటున్నారని, మార్పు రావాలని కోరుకునే హక్కు జీవన్ రెడ్డికి ఎక్కడిదని నిప్పులు చెరిగారు.



## సంగారెడ్డిలో క్యాత్ ల్యాబ్

### ప్రారంభించిన మంత్రి దామోదర రాజనర్సింహా

**సంగారెడ్డి, ఏప్రిల్ 20:** సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని సన్ రైజ్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన క్యాత్ ల్యాబ్ (గుండె సంబంధ చికిత్స) విభాగాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ విభాగాలను ఆయన స్వయంగా పరిశీలించారు. రోగులకు అందుతున్న సదుపాయాల గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లా వేగంగా మెడికల్ హబ్ గా అభివృద్ధి చెందుతోందని హర్షం వ్యక్తం చేశారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు. అత్యాధునిక వైద్య పరికరాలు స్థానికంగా అందుబాటులోకి రావడం వల్ల ప్రజలకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మాధురి, ఆసుపత్రి మేనేజ్‌మెంట్ స్వామి గౌడ్, కాంగ్రెస్ యువజన విభాగం అధ్యక్షుడు పెద్దపట్ల వినయ్ గౌడ్ పాల్గొన్నారు. వీరితో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బంది ఈ ప్రారంభోత్సవంలో భాగస్వామ్యమయ్యారు.

## కేబుల్ బ్రిడ్జిపై బెంజ్ కారు బీభత్సం

### యువకుడు బలి.. పరారైన నిందితులు

### సీసీ టీవీ దృశ్యాల ఆధారంగా విచారణ



**హైదరాబాద్, ఏప్రిల్ 20:** హైదరాబాద్‌లోని మాదాపూర్ కేబుల్ బ్రిడ్జిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అతివేగంగా వచ్చిన మెర్సిడెస్ బెంజ్ కారు ఢీకొనడంతో శ్యామ్ రాజ్ (32) అనే వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఆదివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. జూబ్లీహిల్స్ నుంచి ఐకియా వైపు వెళ్తున్న పశ్చిమ బెంగాల్ రిజిస్ట్రేషన్ కలిగిన బెంజ్ కారు.. బ్రిడ్జిపై ఆగి ఉన్న శ్యామ్ రాజ్‌ను బలంగా ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే నిందితులు కారును అక్కడే వదిలి పారిపోయారు. కారు ఇంజిన్ భాగం దెబ్బతినడంతో కొంతదూరం తీసుకెళ్లి బ్రిడ్జిపైనే పార్క్ చేశారు. డ్రైవర్, మరో వ్యక్తి అక్కడి నుంచి తప్పించుకున్నారు. స్థానికులు వెంటనే బాధితుడిని సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి పంపారు. నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. కేబుల్ బ్రిడ్జిపై ఉన్న సీసీ టీవీ ఫుటేజీని పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

## రాష్ట్రాన్ని దోచుకున్నారు!

### సొంత పార్టీలోనే ఆయనకు గౌరవం లేదు

### ప్రాజెక్టుల రీడిజైన్ అంతా అవినీతే

### రుణమాఫీతో రేవంత్ రెడ్డి రికార్డు

### హరీష్ రావుపై తుమ్మల ధ్వజం

**ఖమ్మం, ఏప్రిల్ 20:** గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో తెలంగాణను నాశనం చేశారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మండిపడ్డారు. వ్యవస్థలను దోచుకుంటూ రాష్ట్రాన్ని రావణకాష్టం చేశారని ధ్వజమెత్తారు. సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. మాజీ మంత్రి హరీష్ రావుపై నిప్పులు చెరిగారు. పదవి పోయిన బాధలో, ఉనికి కోసమే హరీష్ రావు పసలేని విమర్శలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. బిఆర్ఎస్ పార్టీలో హరీష్ రావుకు భవిష్యత్తు లేదని తుమ్మల విమర్శించారు. వరంగల్ సభలో కనీసం ఆయన ఫోటో కూడా పెట్టలేదని, పక్కన పెట్టేశారని గుర్తు చేశారు. పార్టీలో జరుగుతున్న అవమానాల వల్ల హరీష్ రావు మానసిక వేదన అనుభవిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఎక్కడికి వెళ్లినా పాత రికార్డునే ప్లే చేస్తున్నారని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కేవలం కమిషన్ల కోసమే ప్రాజెక్టు డిజైన్లు మార్చారని తుమ్మల ఆరోపించారు. సీతారామ ప్రాజెక్టును తమ ప్రభుత్వం వేగంగా పూర్తి చేస్తోందని తెలిపారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం 21 వేల కోట్లతో రుణమాఫీ చేసి రైతులకు అండగా నిలిచిందని స్పష్టం చేశారు. హరీష్ రావు ఆరోగ్య మంత్రిగా ఉన్నప్పుడు సిఎంఆర్ఎఫ్ నిధులను కూడా వదల్లేదని, దళిత బంధులోనూ దోపిడీ చేశారని దుయ్యబట్టారు. ప్రజలు వారి అక్రమాలను గుర్తించే బుద్ధి చెప్పారని, ఇకపై వారు అధికారంలోకి రావడం అసాధ్యమని తేల్చి చెప్పారు.





## సంపాదకీయం

# కవిత పార్టీతో బీఆర్ఎస్‌కే దెబ్బ!

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కొత్తపార్టీ ప్రకటన మరో నాలుగు రోజుల్లో రానుంది. ఆమె దూకుడు గా రాజకీయాలు నెరపుతున్నారు. టీఆర్ఎస్ పార్టీ పేరు ఖాళీగా ఉంది కనుక దానిని ఎవరైనా వాడుకో వచ్చని అన్నారు. అయితే ఈ నెల 25న ఆమె పార్టీ ప్రకటించనున్నారు. అప్పుడే పార్టీ పేరు ఏంటన్నది తెలుస్తుంది. ఈలోగా చేరికలను ప్రోత్సహిస్తున్నారు. దళితులు, ఆదివాసీలు, బీసీలు లక్ష్యంగా ఆమె చేరికలను ప్రోత్సహిస్తున్నారు. ఇకపోతే టీఆర్ఎస్ పార్టీని పునరుద్దరించే ఆలోచన ఉన్నట్లు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ ఇటీవల ప్రకటించారు. దీంతో ఇప్పుడు టిఆర్ఎస్ కవితకు దక్కిందా లేదా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. అయితే ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే తెలంగాణ ఏర్పడ్డ తర్వాత రెండు పర్యాయాలు అధికారం దక్కడంతో అహంకారంతో విర్రవీగడం, ప్రజలను కావాలనే దూరం పెటట్డం, సిఎం ప్రజలను కలవాల్సిన పనిలేదని చెప్పడం లాంటివన్నీ ప్రజలు గమనించారు. బుద్ది చెప్పాలన్న నిర్ణయానికి వచ్చిన ప్రజలు కెసిఆర్‌ను ఓడించారు. ఎపిలో కూడా జగన్ ఇలాగే నిరంకుశంగా పాలించారు. సొంత డబ్బా కొట్టుకోవడం, సొంత ప్రయోజాలే పాలనగా చూడడం, మద్యం, ఇసుక, మట్టి మాఫియాలు పెరగడం వంటి కారణాలన్నీ తోడయ్యాయి. ప్రజాధనంతో విశాఖలో ఇంద్రభవనాలు కట్టుకోవడం వంటివన్నీ ఎదురుదెబ్బతీసాయి. అందుకే 11 సీట్లకే పరిమితం చేశారు. పాలకులు ఒళ్లు దగ్గరపెట్టుకుని పాలించాలి. తెలంగాణలో ఇప్పుడు రేవంత్ రెడ్డి, ఆయన మంత్రివర్గ సహచరులు కూడా ఇదేవిధంగా పనిచేస్తున్నారు. పైకి ప్రజాపాలన అని చెప్పి ప్రకటనలు చేయడం తప్ప, ఒక్క అభివృద్ధి పని జరగడం లేదు. ఇది రేవంత్ కూడా గుర్తించాలి. లేకుంటే కాంగ్రెస్ పార్టీకి కూడా ఇదే గతి పడుతుంది. ఇకపోతే అపర చాణక్యుడిగా పేరొందిన కేసీఆర్ 2023 ఎన్నికల్లో ఓడిపోయాక కనసీం అసెంబ్లీకి రావడం లేదు. ప్రజల్లోకి రావడం లేదు. ఠంచన్‌గా జీతాలు మాత్రం పొందుతున్నారు. ఈ క్రమంలో పార్టీ పేరును మళ్లీ తెలంగాణ రాష్ట్ర సమితిగా మార్చే విషయం పరిశీలిస్తున్నామని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పుకొచ్చారు. టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చాలనుకున్నప్పుడు అది సరైన నిర్ణయం కాదని వచ్చిన విమర్శలను పట్టించుకోలేదు. సరికదా జాతీయ పార్టీగా ప్రకటించి పలు రాష్ట్రాల్లో ఊరేగారు. తెలంగాణ రాష్ట్ర సమితిని భారత రాష్ట్ర సమితిగా మార్చాలనుకోవడం ఆత్మహత్యాసదృశం అవుతుందని వచ్చిన హెచ్చరికలను పెడచెవిన పెట్టారు. తెలంగాణ అన్న పేరుకు దూరమవడం తెలివి తక్కువ నిర్ణయమని గుర్తించలేకపోయారు. పార్టీలోని మెజారిటీ నాయకులు కూడా ఇదే అభిప్రాయంతో ఉండేవారు. అయితే ఎవరూ నోరు విప్పడానికి సాహసించలేకపోయారు. భిన్నాభిప్రాయాలను కేసీఆర్ ప్రోత్సహించేవారు కాదు. ఎవరు కూడా ఆయన నిర్ణయాలను నిలదీసే ధైర్యం చేసేవారు కాదు. ఇది పార్టీలో ప్రజాస్వామ్యం లేదనడానికి నిదర్శనం. కెసిఆర్ చెప్పిందే వేదం అన్నట్లుగా పార్టీ నడిచింది. ప్రాంతీయ పార్టీల్లో ఇది సహజమే అయినా ఆలోచనలను పంచుకోవాలి. కేసీఆర్‌లో అపర చాణుక్యుడని, అనేక తెలివితేటలు ఉన్నాయని, ఆయన వేసే రాజకీయ ఎత్తుగడలకు తిరుగుండదని, ఆయన ఎలా చెబితే అలాగే జరుగు తుందని నమ్మే స్థితికి పార్టీ నేతలు వచ్చారు. ఈ కారణంగానే తెలంగాణ రాష్ట్ర సమితిని జాతీయ పార్టీగా విస్తరించి భారత రాష్ట్ర సమితి పేరిట ఇతర రాష్ట్రాలలో కూడా పోటీ చేసి తగినన్ని సీట్లు గెలుచుకొని కేంద్రంలో చక్రం తిప్పుతానని కేసీఆర్ పెద్ద ఎత్తున ప్రచారం చేసుకున్నారు. ఇతర ప్రాంతీయ పార్టీల నాయకులను కలిసి తనకుతాను అతిపెద్ద నాయకుడిగా ఊహించుకున్నారు. జాతీయ రాజకీయాల పేరుతో నేల విడిచి సాము చేసిన కెసిఆర్ బొక్కబోర్లా పడ్డారు. తెలంగాణను బాగుచేయకుండా, అవినీతికి గేట్లు తెరిచి, జాతీయ రాజకీయాలు అంటూ కేసీఆర్ ఊరేగడాన్ని తెలంగాణ సమాజం కూడా హర్షించలేదు. ఫలితంగానే 2023లో కెసిఆర్ ఓడించారు. పార్టీలో సమష్టి నిర్ణయాలు, ఆలోచనలకు తావులేకుండా చేయడం వల్లనే కేసీఆర్ రాజకీయంగా దెబ్బతిన్నారు. దీనికితోడు తెలంగాణ ఉద్యమంతో సంబంధం ఉన్న వారిని బయటకు తరిమేశారు. తమకు తిరుగు లేకుండా చూసుకున్నారు. పార్టీలో పోరాటం చేసిన వారెవరూ లేకుండా చేయడం వల్లనే బీఆర్ఎస్‌కు ప్రస్తుత దుస్థితి ఏర్పడింది. తండ్రీ, తనయులదే పెత్తనంగా సాగింది. ఇద్దరు నేతల్లో నియంతృత్వ పోకడలు పెరగడంతో సమష్టి నిర్ణయాలకు ఆస్కారం లేకుండా పోయింది. అధికారంలో ఉన్నప్పుడు తప్పులు చేశామని ఇంత కాలానికి కేటీఆర్ అంగీకరించారు. ఇదొక శుభ పరిణామం. అధికారంలో ఉన్నప్పుడు అహంకారంతో, అతిశయంతో వ్యవహరించిన వారికి గుణపాఠాలు తప్పవు. ఎన్టీఆర్ అంతటి నాయకుడు కూడా ఎన్నికల్లో ఓడిపోయారు. ఈ ఉదంతాలు తెలిసి కూడా కేసీఆర్ అదే బాటలో అహంభావంతో వ్యవహరించారు. నేల విడిచి సాము చేశారు. పరాజయం మూటగట్టుకున్నారు. ఏ పార్టీకైనా బలమైన నాయకుడు ఎంత ముఖ్యమో స్వతంత్రంగా ఆలోచించి ప్రజాభిప్రాయాన్ని అధినాయకుడికి నిక్కచ్చిగా చెప్పగలిగిన నాయకులు కూడా అంతే అవసరం. కేవలం కొడుకు, అల్లుళ్లను పట్టుకుని వేలాడడం వల్లనే ఈ దుస్తితి ఏర్పడింది. కూతరు కవిత బయటకు పోయింది. ఆమె పార్టీ పెడితే మొదట దెబ్బతినేది కూడా బిఆర్ఎస్ అని గుర్తించాలి.

# హార్మూజ్ దాటొద్దు

- భారత నౌకలకు నేవీ 'రెడ్ అలర్ట్'!
- ఇరాన్ కాల్పుల నేపథ్యంలో అడ్వైజరీ..
- అనుమతి వచ్చే వరకు నిలపాలని ఆదేశం



**న్యూఢిల్లీ:** హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలు పరాకాష్టకు చేరడంతో భారత నౌకాదళం (ఇండియన్ నేవీ) అత్యవసర హెచ్చరికలు జారీ చేసింది. భారత పతాకంతో ప్రయాణిస్తున్న నౌకలపై ఇరాన్ బలగాలు కాల్పులు జరిపిన ఘటనను తీవ్రంగా పరిగణించిన నేవీ, తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ఆ జలసంధి వైపు వెళ్లొద్దని నౌకలకు స్పష్టం చేసింది. ముఖ్యంగా లారక్ ఐలాండ్‌కు దూరంగా ఉండాలని సూచించింది. దేశ భద్రత మరియు వాణిజ్య ప్రయోజనాల దృష్ట్యా ఈ అడ్వైజరీ జారీ చేసినట్లు రక్షణ వర్గాలు వెల్లడించాయి. ఇటీవల 'జగ్ అర్ణవ్', 'సన్మార్ హెరాల్డ్' అనే రెండు భారత నౌకలు హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణిస్తుండగా ఇరాన్ బలగాలు వాటిని లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరిపాయి. ఈ ఘటనపై భారత విదేశాంగ శాఖ ఇప్పటికే తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఢిల్లీలోని ఇరాన్ రాయబారి మహమ్మద్ ఫతాలీని పిలిపించి ప్రభుత్వం గట్టి హెచ్చరికలు జారీ చేసింది. గతంలో ఇరాన్ నౌకల ప్రయాణానికి సహకరించిందని, కానీ ప్రస్తుత తీరు సరికాదని భారత్ స్పష్టం చేసింది.

హోర్ముజ్ జలసంధిని చివరిగా 'దేశ్ గరిమ' అనే ట్యాంకర్ సురక్షితంగా దాటినట్లు సమాచారం. హర్మూజ్ జలసంధి దిగ్బంధంతో చమురు సరఫరాకు ఆటంకం కలగకుండా కేంద్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. ఇరాన్ మార్గానికి బదులుగా రష్యా నుంచి దిగుమతులు పెంచుకునేందుకు మార్గం సుగమం చేసింది. ఇందులో భాగంగా 11 రష్యా బీమా సంస్థలకు భారత్‌లో సేవలు అందించేందుకు అనుమతులు మంజూరు చేసింది. గ్యాస్‌ప్రోమ్ ఇన్స్యూరెన్స్, రోస్‌గోస్‌ట్రాక్, స్బెర్‌బ్యాంక్ వంటి సంస్థలు ఈ జాబితాలో ఉన్నాయి. సాధారణంగా అంతర్జాతీయంగా ప్రాచుర్యం పొందిన 'పీ అండ్ ఐ క్లబ్స్' రష్యా నౌకలకు బీమా ఇవ్వవు కాబట్టి, భారత ప్రభుత్వమే నేరుగా రష్యా సంస్థలకు అనుమతినిస్తూ సాహసోపేత నిర్ణయం తీసుకుంది. హర్మూజ్ జలసంధిలో ఇరాన్–అమెరికా మధ్య నెలకొన్న ఉద్రిక్తతల వల్ల చమురు రవాణా అగిపోయే ముప్పు ఉంది. అయితే, రష్యా నుంచి వచ్చే నౌకలు ఎర్ర సముద్రం మీదుగా ఆసియాకు చేరుకునే అవకాశం ఉండటంతో భారత్ మాస్కో వైపు మొగ్గు చూపుతోంది. రష్యా నుంచి చమురు కొనుగోళ్లకు అమెరికా ట్రెజరీ డిపార్ట్‌మెంట్ కూడా అనుమతులను పొడిగించడం భారత్‌కు కలిసివచ్చే అంశం. ఏది ఏమైనా, అంతర్జాతీయ ఉద్రిక్తతల మధ్య దేశీయంగా ఇంధన కొరత తలెత్తకుండా కేంద్రం వేగంగా అడుగులు వేస్తోంది.

# దక్షిణ కొరియా ద్వైపాక్షిక సంబంధాలు బలోపేతం

- అధ్యక్షుడు లీ జె మ్యూంగ్‌తో ప్రధాని

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 20:** భారత్, దక్షిణ కొరియా మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలపడుతున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యూంగ్ మూడు రోజుల పర్యటన కోసం భారత్ వచ్చారు. ఇరు దేశాల మధ్య సోమవారం పలు ఒప్పందాలు కుదిరాయి. అనంతరం నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో ప్రధాని మోదీ మాట్లాడారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల్లో ఇది కీలక ముందడుగు అని అన్నారు. భారత్, దక్షిణ కొరియా మధ్య సంబంధాలు కేవలం వాణిజ్యానికి మాత్రమే పరిమితం కాకుండా టెక్నాలజీ, రక్షణ, షిప్ బిల్డింగ్, ఎనర్జీ వంటి విభిన్న రంగాల్లో విస్తరిస్తున్నాయని ప్రధాని పేర్కొన్నారు. చిప్స్ నుంచి షిప్స్ వరకు, ట్యాలెంట్ నుంచి టెక్నాలజీ వరకు, ఎంటర్‌టైన్‌మెంట్ నుంచి ఎనర్జీ వరకు.. ఇలా వివిధ రంగాల్లోని అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా దక్షిణ కొరియాతో భాగస్వామ్యం చేసుకుంటున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య సుమారు 27 బిలియన్ డాలర్లుగా ఉన్న వాణిజ్యాన్ని 2030 నాటికి 50 బిలియన్ డాలర్లకు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రధాని తెలిపారు. ఈ సమావేశంలో పలు కీలక ఒప్పందాలు కూడా కుదిరాయి. ముఖ్యంగా పారిశ్రామిక రంగం, టెక్నాలజీ, ఎనర్జీ, క్రిటికల్ మినరల్స్ వంటి రంగాల్లో పరస్పరం సహకరించుకునేందుకు ఇరు దేశాలు అంగీకరించాయి.



అలాగే ఇండో–పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం కోసం రెండు దేశాలు కలిసి పనిచేస్తాయని మోదీ తెలిపారు.

## చమురు ధరలు దిగిరావచ్చు

### యూఎస్ ఇంధన శాఖ మంత్రి క్రిస్‌రైట్

**వాషింగ్టన్, ఏప్రిల్ 20:** యూఎస్, ఇరాన్ మధ్య రాజీ కుదరకపోవచ్చన్న భయాలతో చమురు ధరల మళ్లీ పెరగడం మొదలెట్టాయి. ఈ నేపథ్యంలో అమెరికా ఇంధన శాఖ మంత్రి క్రిస్‌రైట్ కీలక వ్యాఖ్యలు చేశారు. యూఎస్‌లో ఇంధన ధరలు ఇప్పటికే గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయని అన్నారు. అయితే, వచ్చే ఏడాది వరకూ గ్యాలన్ పెట్రోల్ ధరలు 3 డాలర్లకు పైబడే ఉండవచ్చని అన్నారు. 'ధరలు ఇప్పటికే పతాకస్థాయికి చేరుకున్నాయి. కాబట్టి ఇక తగ్గడం మొదలు కావచ్చు. ఈ ఏడాది చివర్లో లేదా వచ్చే ఏడాదికి కానీ ధరలు దిగిరాకపోవచ్చు' అని తాజాగా ఒక మీడియా సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పేర్కొన్నారు. యుద్దానికి ముగింపు పడితే ధరలు సహజంగానే తగ్గుముఖం పడతాయని అన్నారు. ప్రభుత్వ వర్గాలు మాత్రం ఇందుకు భిన్నమైన వాదనను వినిపిస్తున్నాయి. గ్యాలన్ పెట్రోల్ ధర 3 డాలర్ల కంటే దిగువకు చేరుకుంటుందని అన్నారు.

# జమ్ముకాశ్మీర్‌లో ఘోర ప్రమాదం

### బస్సు బోల్తాపడి 15మంది మృతి



**శ్రీనగర్, ఏప్రిల్ 20:** జమ్మూ కాశ్మీర్ కాగోర్ట్ సమీపంలోని రామ్‌నగర్– ఉదంపూర్ జాతీయ రహదారిపై బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 15 మంది ప్రయాణికులు మరణించారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్య చికిత్స కోసం వారిని ఉదంపూర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. ఈ ప్రమాద ఘటనపై సమాచారం అందుకోగానే జిల్లా ఉన్నతాధికారులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అతివేగం కారణంగా బస్సు డ్రైవర్ నియంత్రణ కోల్పోవడమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని ప్రత్యక్ష సాక్ష్యులు వెల్లడించారు. సోమవారం రామ్‌నగర్ నుంచి ఉదంపూర్ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాద ఘటనపై ఉదంపూర్ జిల్లా ఉన్నతాధికారులతో స్థానిక ఎంపీ, కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ స్వయంగా ఫోన్ చేసి మాట్లాడారు. ఈ ప్రమాదంపై ఆయన ఆరా తీశారు. క్షతగాత్రులను మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. తీవ్రంగా గాయపడిన వారికి అత్యవసర వైద్య సహాయం కోసం ఎయిర్ అంబులెన్స్ ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. మరోవైపు జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఈ ప్రమాద ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధితులకు సాధ్యమైన మేరకు అన్ని సహాయ సహకారాలు అందించాలని జిల్లా ఉన్నతాధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. ఈ మేరకు ఎక్స్ ఖాతా ద్వారా కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా స్పందించారు.






# ఇరాన్- అమెరికా శాంతి చర్చల్లో ప్రతిష్టంభన

### చర్చలకు రావడం లేదని తేల్చిన ఇరాన్

**టెహ్రాన్, ఏప్రిల్ 20:** పాకిస్థాన్ వేదికగా అమెరికా–ఇరాన్ మధ్య సోమవారం జరగాల్సిన రెండో దఫా శాంతి చర్చలు ఆగిపోయాయి. చర్చలకు రావడం లేదని ఇరాన్ స్పష్టం చేసింది. యూఎస్ నౌకాదళం తమ కార్గో షిప్‌ను స్వాధీనం చేసుకోవడంతో తీవ్ర ఆగ్రహానికి గురైన ఇరాన్ శాంతి చర్చల్లో పాల్గొనేది లేదని తేల్చి చెప్పింది. 22వ తేదీతో అమెరికా–ఇరాన్ మధ్య రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం ముగియనుంది. కాల్పుల విరమణ ఒప్పందం గడువు ముగిసే లోపు అమెరికా–ఇరాన్ మధ్య ఇస్లామాబాద్ వేదికగా శాంతి నెలకొంటుందని చాలా దేశాలు భావించాయి. అయితే ప్రపంచ దేశాల ఆశలు ఫలించలేదు. అమెరికా వైఖరి కారణంగానే శాంతి చర్చలకు వెళ్లడం లేదని టెహ్రాన్ పేర్కొంది. ఇరాన్ జెండాతో ఉన్న వాణిజ్య నౌక తౌస్కాను అమెరికా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. నౌకపై తొలుత కాల్పులు జరిపి ఆపై అదుపులోకి తీసుకున్నాయి . అమెరికా తమ నౌకను స్వాధీనం చేసుకోవడంపై ఇరాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది . ఈ చర్యను ఇరాన్‌పై దాడిగా భావిస్తూ త్వరలోనే ప్రతీకారం తీసుకుంటామని హెచ్చరించింది. అమెరికా చర్యలు కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడమేనని, ఇస్లామాబాద్‌లో మలి విడత చర్చలకు రావడం లేదని ఇరాన్ తెలిపింది. అలాగే ఇరాన్ నౌకాశ్రయాలపై అమెరికా దిగ్బంధనం కొనసాగించడం, శాంతి చర్చల నేపథ్యంలో అగ్రరాజ్యం పెట్టిన డిమాండ్లు కూడా ఇరాన్‌కు రుచించడం లేదు. ఈ నేపథ్యంలో రెండో దఫా శాంతి చర్చలు ప్రారంభం కాకుండానే విఫలమైనట్టు కనిపిస్తోంది.

## కేజీబీవీని తనిఖీ చేసిన తహశీల్దార్



**తాండూర్:** తాండూర్ గ్రామపంచాయతీ పరిధిలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని తాండూర్ తహశీల్దార్ యు.జ్యోత్స్న సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేజీబీవీలోని వంటశాలను సందర్శించి విద్యార్థినులకు వండిన ఆహారాన్ని పరిశీలించారు. అనంతరం వంటకాలను రుచి చూశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ విద్యార్థినులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించాలని సిబ్బందికి సూచించారు. ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కేజీబీవీని సందర్శించినట్లు తెలిపారు. ఆమె వెంట డిప్యూటీ తహశీల్దార్ జె.కల్పన, కేజీబీవీ ఎస్ఓ జె.కవిత, కేజీబీవీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల్లో గెలుపోటములు సహజమే



**కాగజ్నగర్:** క్రీడల్లో గెలుపోటములు సహజమేనని సర్పంచ్ వేనపల్లి స్రవంతి సుధాకర్ అన్నారు. దహెగాం మండలం బోర్లకుంట గ్రామపంచాయతీ పరిధిలోని రాళ్లగూడ గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నిమెంట్ ముగింపు కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టోర్నిమెంట్లో విజయం సాధించిన జట్లకు ఉప సర్పంచ్ తిరుపతితో కలిసి బహుమతులు ప్రదానం చేశారు. టోర్నిమెంట్లో రాళ్లగూడ జట్టు మొదటి బహుమతిని గెలుచుకోగా, ఇట్యాల జట్టు రెండవ బహుమతిని సాధించింది. అనంతరం వారు మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు స్నేహభావం పెంపొందుతుందని తెలిపారు. యువత చదువుతో పాటు క్రడల్లోనూ రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సంజీవ్ సాగర్, కృష్ణంరాజు, శ్రీకాంత్, చిరంజీవి, గోపి, సాయికృష్ణ, భాస్కర్, మాజీ సర్పంచ్ మధుకర్, ఇట్యాల సర్పంచ్ జయలక్ష్మి , గజ్జల సురేష్, ఉప సర్పంచ్ శ్రీనివాస్, సీఐ కుమారస్వామి, దహెగాం ఎస్సై రమేష్, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షులు దందెర మల్లేష్, మోరె సాయిప్రకాష్, గ్రామ పెద్దలు చౌదరి విలాస్, వడ్డేటి సాయి, భీమన్కర్ రవి, వగాడే బాపురావు, భీమన్కర్ రమేష్, రౌతు పత్రు, ఒడ్డేటి వెంకటేష్, భీమన్కర్ నానాయ్య, పాలే నానాజీ, సపుతే నారాయణ, గాండ్ల రవి, భీమన్కర్ మోహన్, వగాడే సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## పూలే విగ్రహ ఆవిష్కరణ కరపత్రాల విడుదల

**కాగజ్నగర్:** వాంకిడి మండలం నర్సాపూర్ గ్రామంలో మహాత్మ జ్యోతిరావు పూలే



విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఈనెల 25న నిర్వహించనున్న నేపథ్యంలో సోమవారం కోస్ని గ్రామంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాలి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లేండుగురే శ్యాంరావు చేతుల మీదుగా కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి మాలిలు, సంఘ నాయకులు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాంకిడి మండల అధ్యక్షులు వడై బాబురావు, మండల జనరల్ సెక్రటరీ వస్తాకే హనుమంతు, ముండోర్ వెంకటేష్ తదితర మాలి సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ కూలీలకు మజ్జిగ పంపిణీ

**తాండూర్:** మండలంలోని రాజీవ్ నగర్ గ్రామపంచాయతీ పరిధిలో కొనసాగుతున్న ఉపాధిహామీ పనుల్లో పాల్గొంటున్న కార్మికులకు ఎండల తీవ్రత నుంచి



ఉపశమనం కల్పించేందుకు సోమవారం తాండూర్ ఎంపీడీఓ శ్రీనివాస్, సర్పంచ్ మామిడాల లలిత–రాజేశం బిస్కెట్లు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. మండుతున్న ఎండల్లో పనిచేస్తున్న కార్మికులు వడదెబ్బకు గురికాకుండా ఉండాలని, తరచూ నీరు, మజ్జిగ తీసుకుంటూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఈ సందర్భంగా ఎంపీడీఓ సూచించారు. ప్రభుత్వం ఉపాధిహామీ కార్మికుల ఆరోగ్య రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, ముఖ్యంగా మధ్యాహ్నం వేళల్లో జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కాపర్తి సుభాష్, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల దాహార్తి తీర్చే చలివేంద్రాలు అవసరం

- ములుగు పోలీస్ హెడ్ క్వార్టర్లో చలివేంద్రం ప్రారంభించిన మంత్రి

**ములుగు:** వేసవిలో ప్రజల దాహార్తి తీర్చే చలివేంద్రాలు ఎంతో అవసరమని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. ములుగు జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్లో ములుగు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం రిబ్బెన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ వేసవి కాలంలో ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ములుగు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో వార్డులు, ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. పోలీస్ హెడ్ క్వార్టర్స్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందితో పాటు అక్కడికి వచ్చే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున ప్రజలు అత్యవసర పనులు ఉంటే తప్పా ఇంటి నుంచి బయటకు రావద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ములుగు మున్సిపాలిటీ చైర్మన్ చింతనిప్పుల చంద్రకళ బిక్షపతి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, కిసాన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, మున్సిపాలిటీ కమిషనర్ రమేష్, ములుగు ఎస్సై ఉపేందర్ రావు, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# దేవాలయాలు సామాజిక ఐక్యతకు ప్రతీకలు

- వెంకటాపూర్లో పెద్దమ్మ గుడి శంకుస్థాపన చేసిన మంత్రి సీతక్క

**ములుగు:** దేవాలయాలు సామాజిక ఐక్యతకు ప్రతీకలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి దనసరి అనసూయ సీతక్క అన్నారు. వెంకటాపూర్ మండలంలో పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.30 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న పెద్దమ్మ గుడి నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పూజలు నిర్వహించి ఆలయ నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో దేవాలయాల అభివృద్ధి ద్వారా ఆధ్యాత్మిక వాతావరణం మరింత బలపడుతుందని అన్నారు. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికీ ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మామిడిశెట్టి సుగుణ స్వామి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, పంచాయతీరాజ్ శాఖ స్టేట్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు చెన్నోజు సూర్యనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ బండి శ్రీను, గ్రామ కమిటీ అధ్యక్షుడు చెన్నోజు శ్రీను, ఎన్ఎస్యూఐ జిల్లా అధ్యక్షుడు మామిడిశెట్టి కోటి, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, యువ నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శకత్వం అవసరం

**కాగజ్నగర్:** విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు మార్గదర్శకత్వం ఎంతో అవసరమని కౌటాల ఎస్సై చంద్రశేఖర్ అన్నారు. కౌటాల మండల కేంద్రంలో జన భవిత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాలీసెట్ ఉచిత కోచింగ్ సెంటర్ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ వ్యవస్థాపకులు చంద్రశేఖర్ జాడే సమాజ సేవలో చూపుతున్న ఉదారత, సేవాభావం అభినందనీయమని కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల భవిష్యత్తు కోసం ఇలాంటి ఉచిత కోచింగ్ సెంటర్లు ఎంతో దోహద పడతాయని పేర్కొన్నారు. జేబీసీటీ, మాటా సంస్థలు విద్యా రంగంలో చేస్తున్న సేవలను ప్రశంసించారు. అనంతరం చింతల మానేపల్లి మండల ఎంఈఓ పసాల జయరాజ్ పాలీసెట్ పరీక్ష ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. సరైన మార్గదర్శకత్వం, క్రమశిక్షణతో చదివితే మంచి ర్యాంకులు సాధించవచ్చని సూచించారు. ఈ సందర్భంగా జేబీసీటీ అధ్యక్షుడు డి.సురేష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే తమ ట్రస్ట్ లక్ష్యమని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.




# కూలీల సమస్యలు పరిష్కరించాలి

**నేరడిగొండ:** మండలంలోని బొరిగాం గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంఎన్ఆర్ఈజీఎస్) కింద జరుగుతున్న పనులను సోమవారం అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామ పరిధిలో కొనసాగుతున్న పనులను పర్యవేక్షిస్తూ మస్టర్ రోల్స్ను తనిఖీ చేశారు. పనుల నాణ్యత, కూలీల హాజరు, పనుల పురోగతిని సమగ్రంగా పరిశీలించి నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. అర్హులైన ప్రతిఒక్కరికీ ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని, అమలులో పారదర్శకత పాటిస్తూ కూలీలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. పనుల పరిశీలన అనంతరం కూలీలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో పని ప్రదేశాల్లో నీడ కోసం చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. గత కొన్ని వారాలుగా పెండింగ్లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలీ రేటును పెంచాలని డిమాండ్ చేశారు. దీనిపై అధికారులు సానుకూలంగా స్పందిస్తూ పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పెండింగ్ వేతనాల చెల్లింపు ప్రక్రియను వేగవంతం చేసి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ వసంతరావు, ఫీల్డ్ అసిస్టెంట్ విజయ్ కుమార్, ఈసీ కరీం, టీఏ లక్ష్మణ్, గ్రామస్తులు రాథోడ్ లాలాసింగ్, గులాబ్ సింగ్, జాదవ్ నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.



# పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

**సోనాల:** పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ అన్నారు. సోనాల మండలంలోని సాకేరా గ్రామంలో సోమవారం పర్యటించారు. గ్రామానికి చేరుకున్న ఆయనకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో నెలకొన్న తాగునీటి ఎద్దడి, గృహ నిర్మాణాల్లో ఎదురవుతున్న సాంకేతిక ఇబ్బందులను మహిళలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆడే గజేందర్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకోవడానికే గ్రామాలకు వస్తున్నానని తెలిపారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. లబ్ధిదారుల ఇళ్లలో పూజా కార్యక్రమాలు నిర్వహించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ పేదల పక్షాన నిలుస్తుందని, ప్రతి కుటుంబానికి న్యాయం చేయడమే తమ ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ద్వారా పేదలకు ఆత్మగౌరవంతో కూడిన నివాసం కల్పించడం సంతోషకరమని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఏ సమస్య వచ్చినా అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# ఇంద్రవెల్లిలో భావోద్వేగ క్షణాలు

**• 45 ఏళ్ల తర్వాత స్వేచ్ఛగా అమరులకు నివాళి**



**ఆదిలాబాద్:** ఇంద్రవెల్లి అమరవీరుల స్మృతివనంలో సోమవారం ఆదివాసీల ఆత్మగౌరవాన్ని ప్రతిబింబించేలా స్మారక వేడుకలు ఘనంగా నిర్వహించారు. దాదాపు 45 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ అనంతరం ఎలాంటి ఆంక్షలు లేకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో గిరిజనులు అమరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్మృతివనం గిరిజనుల రాకతో జనసందోహంగా మారింది. ఈ కార్యక్రమానికి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాజీ ఎంపీ సోయం బాపూరావ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఆసిఫాబాద్ కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆత్రం సుగుణలతో కలిసి అమరవీరుల స్థూపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి జెండాను ఆవిష్కరించారు. అనంతరం అమరుల త్యాగాలను స్మరిస్తూ పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అమరుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. స్మృతివనం చుట్టూ కాంపౌండ్ వాల్, సోలార్ విద్యుత్, బోర్వెల్ సౌకర్యాలు కల్పించామని, మరో రూ.15 లక్షలతో వనాన్ని మరింత అభివృద్ధి చేస్తామని అన్నారు. ఆర్వోఎఫ్ఆర్ ద్వారా గిరిజనులకు భూహక్కులు కల్పించామని, ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. ఏజెన్సీ ప్రాంతాల్లో త్రీఫేజ్ విద్యుత్, తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు ఐటీడీఏ, అటవీ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆత్రం భుజేంద్రరావు రచించిన "ఆ గాయానికి 44 ఏళ్లు"అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ గిరిజనులు ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకోవాలని, ముఖ్యంగా ఆడపిల్లల విద్యపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. పోలీస్ సభల ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఐటీడీఏ పీఓ యువరాజ్ మర్మాట్ మాట్లాడుతూ స్మృతివన అభివృద్ధి పనులను మూడు నెలల్లో పూర్తి చేస్తామని, తాగునీటి సమస్య ఉన్న గ్రామాల్లో కొత్త బోర్లు, బావుల మంజూరుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు, గ్రామ పటేళ్లు, సార్మేడీలు, భారీ సంఖ్యలో గిరిజన ప్రజలు పాల్గొన్నారు.

# రైతుల సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలి

**• తల్లాడలో తెలంగాణ రైతు సంఘం ఖమ్మం జిల్లా తృతీయ మహాసభలు**



**సత్తుపల్లి:** రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని తెలంగాణ రైతు సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఆ సంఘం ఖమ్మం జిల్లా తృతీయ మహాసభలు సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని తల్లాడ మండల కేంద్రంలోని వాసవి కళ్యాణ మండపం, సామినేని రామారావు నగర్లోని కాసాని ఐలయ్య ప్రాంగణంలో త్వరలో జరగనున్నందున సోమవారం నిర్వహించిన సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, సీనియర్ నాయకులు తాతా భాస్కరరావు లు మాట్లాడారు. జిల్లాలో రైతులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, భూభారతి పోర్టల్ లో లోపాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. భూమి కలిగిన ప్రతి రైతుకు పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు సీతారామ ప్రాజెక్టు త్వరితగతిన పూర్తి చేసి, రూ.9వేల కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలకు మరమ్మతులు చేపట్టి, రైతులకు సాగునీరు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కౌలు రైతులను గుర్తించి 2011 సాగుదారు చట్టం ప్రకారం గుర్తింపు కార్డులు జారీ చేసి, బ్యాంకు రుణాలు, పంట అమ్మకాలు, ఎరువుల సబ్సిడీలలో వాటిని ప్రామాణికంగా తీసుకోవాలని సూచించారు. గ్రామ సభలు నిర్వహించి కౌలుదారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న విత్తన చట్టం, విద్యుత్ సంస్థల మార్కెట్ ముసాయిదా బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తూ మహాసభల్లో రైతుల సమస్యలపై చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు శీలం సత్యనారాయణ రెడ్డి, నల్లమోతు మోహన్ రావు, కళ్యాణపు కృష్ణయ్య, గుంటుపల్లి వెంకటయ్య, సత్తెనపల్లి నరేష్, షేక్ మస్తాన్, గండమల ఆనందరావు, పెరసాని వెంకటయ్య, పులి వెంకట నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# మ్యాపింగ్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ చిత్రు**




**ఆదిలాబాద్:** ఓటరు ప్రోజెని మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ చిత్రు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన ఓటరు మ్యాపింగ్పై అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఆయన అధికారులతో మాట్లాడుతూ ఓటరు ప్రోజెని మ్యాపింగ్ ప్రక్రియలో వేగం పెంచాలని సూచించారు. బిఎల్ఓలు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. నిర్ణీత గడువులోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో ఆర్డిఓ స్రవంతి, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అమరవీరుల త్యాగాలు మరువలేనివి

**డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్**



**ఆదిలాబాద్:** అమరవీరుల త్యాగాలు మరువలేనివని డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్ అన్నారు. ఇంద్రవెల్లి అమరవీరుల స్థూపం వద్ద సోమవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, మాజీ ఎంపీ సోయం బాపురావు, ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మీ తదితరులతో కలిసి అమరవీరుల స్మారకార్థం పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దశాబ్దాల క్రితం ఇంద్రవెల్లి గడ్డపై ఆదివాసీల హక్కుల కోసం పోరాడి ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని కొనియాడారు. వారి ఆశయాల సాధనకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. ఆదివాసీల సంక్షేమం, జల్ జంగిల్ జమీన్ హక్కుల రక్షణ కోసం, పార్టీ నిరంతరం పోరాడుతుందని, వారి అభివృద్ధికి అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంద్రవెల్లి మార్కెట్ చైర్మన్ ఉత్తమ్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మల్యాల కరుణాకర్, జిల్లా నాయకులు యాకుబ్, జిల్లా కార్యదర్శి మెస్రం నాగ్నాథ్, సుకంట్ రావు, పోతన్న, దౌలత్ రావు, చంద్రశేఖర్, విశాల్, పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

# కవి మధు భావల్కర్ కు అమెరికన్ యూనివర్సిటీ డాక్టరేట్

**ఆదిలాబాద్:** ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ప్రముఖ కవి, సాహితీవేత్త మధు భావల్కర్ అంతర్జాతీయ స్థాయి గౌరవ డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. సాహితీ రంగంలో ఆయన చేసిన 55 ఏళ్ల సుదీర్ఘ కృషి, సామాజిక చైతన్యం కోసం అందిస్తున్న సేవలను గుర్తిస్తూ లూసియానా అమెరికన్ యూనివర్సిటీ ఈ గౌరవాన్ని ప్రకటించింది. ఆదివారం మహారాష్ట్ర పుణేలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రతినిధులు ఆయనకు ఈ పట్టాను అందజేశారు. మధు భావల్కర్ రాసిన కవితలు ప్రపంచ వ్యాప్తంగా 60 దేశాల్లో ప్రచురితం కాగా, ఆయన రాసిన 10 గ్రంథాలు విశేష ప్రాచుర్యం పొందాయి. బుద్ధుడు, అంబేద్కర్ ఆశయాలను తన రచనలు, ప్రసంగాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లినందుకు ఈ గుర్తింపు లభించింది. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ డైరెక్టర్లు డాక్టర్ అనిల్ కృష్ణ భరద్వాజ్, డాక్టర్ రమేష్ బినోనేకార్, మాజీ న్యాయమూర్తి శివదాస్ ప్రముఖులు పాల్గొని భావల్కర్ ను అభినందించారు. అణగారిన వర్గాల అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నందుకు ఈ గౌరవం దక్కిందని భావల్కర్ ఈ సందర్భంగా సంతోషం వ్యక్తం చేశారు.




# హక్ ఐ కేర్ ఆప్టికల్ సెంటర్ ప్రారంభం



**కాగజ్నగర్:** కాగజ్నగర్ పట్టణంలోని నిఖిల్ మెడికల్ సమీపంలో ఏర్పాటు చేసిన హక్ ఐ కేర్ ఆప్టికల్ అండ్ విజన్ సెంటర్ ను జెడ్పి మాజీ చైర్మన్ కోనేరు కృష్ణారావు మున్సిపల్ వైస్ చైర్పర్సన్ డాక్టర్ అనితతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన కంటి పరీక్షా పరికరాలను పరిశీలించారు. ప్రజలకు నాణ్యమైన కంటి పరీక్షలు, ఆధునిక ఆప్టికల్ సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ సెంటర్ను ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, స్థానిక నాయకులు పాల్గొని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

# నీటి సమస్య పరిష్కారానికి కృషి



**తిర్యాణి:** నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఉపసర్పంచ్ చెని కుమార్ తెలిపారు. మండలంలోని తిర్యాణి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కారానికి చర్యలు చేపడతానని పేర్కొన్నారు. సోమవారం నాయకపుగూడ గ్రామంలో చెడిపోయిన నీటి పంపుకు మరమ్మతులు చేయించి ప్రజలకు తాగునీరు అందేలా చర్యలు తీసుకున్నారు. ఎండాకాలం కావడంతో తాగునీటి సమస్యలు ఏర్పడే అవకాశం ఉందని, గ్రామస్తులు సమస్యలను వెంటనే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు ఎడ్ల భాగ్య తిరుపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

# చలివేంద్రం ప్రారంభం



**సత్తుపల్లి:** సత్తుపల్లి పట్టణంలోని సిద్ధారం రోడ్డు ఆటో స్టాండ్ వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించారు. రోజురోజుకు పెరుగుతున్న ఎండలతో ప్రయాణికులు తాగునీటి కోసం ఇబ్బంది పడకుండా సత్తుపల్లి పట్టణంలోని ఏఐటియుసి సిద్ధారం రోడ్ ఆటో స్టాండ్ వద్ద చలివేంద్రాన్ని ప్రముఖ వ్యాపారవేత్త పత్తి విశ్వేశ్వరరావు ఆర్థిక సహకారంతో సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మటూరి రామకృష్ణ, సత్తుపల్లి మార్కెట్ కమిటీ సభ్యులు వినుకొండ కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రజలకు మంచినీరు అందించారు. ఈ కార్యక్రమంలో సిద్ధారం రోడ్డు ఆటో ఓనర్ కం వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు సిహెచ్ కాశి రావు, రాంబాబు, కోటయ్య వెంకట్, హరిబాబు, అర్జున్ రావు, రాము, పుల్లయ్య, సకుర్తి వెంకటేశ్వర్లు, పరస వెంకన్న, సత్తుపల్లి మండల కార్యదర్శి తెలగారపు రామారావు తదితరులు పాల్గొన్నారు.

# హై కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షునికి సన్మానం

**ఆదిలాబాద్:** బోథ్ మండలంలోని కౌట(బి) గ్రామానికి చెందిన సింగిడి సురేందర్ రెడ్డి ఇటీవల ఎన్నికల్లో తెలంగాణ హై కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా గెలుపొంది తొలి సారి ఆదిలాబాద్ జిల్లా కు వచ్చారు. ఈ సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని రెడ్డి హాస్టల్ లో రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షులు నల్ల నారాయణ రెడ్డి, ఉపాధ్యక్షులు, తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి కలిసి ఆయనను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి గోపిడి రాం రెడ్డి, కార్యవర్గ సభ్యులు మంజుల రెడ్డి అడ్వకేట్, స్వామి రెడ్డి, పొద్దుటూరి నారాయణ రెడ్డి, భూమారెడ్డి, సవీన్ రెడ్డి, శివ ప్రసాద్ రెడ్డి, జలంధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల:** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాల యాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య, జిల్లా అదనపు కలెక్టర్ రాములుతో కలిసి అర్జిదారుల నుంచి దరఖాస్తులు స్వీక రించారు. నెన్నెల మండలం నార్వాయిపేట గ్రామానికి చెందిన కైరత్ పాషా తమ తాతల నుంచి వారసత్వంగా వస్తున్న భూమిని కొందరు అక్రమంగా మార్చి పట్టా చేసుకున్నారని, విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని అర్జీ సమర్పించారు. మంచిర్యాల పట్టణానికి చెందిన సాయిని శ్రీనివాస్ తనకు హాజీపూర్ మండలం దొనబండ గ్రామ శివారులో గల భూమి వివరాలను భూ భారతి పోర్టల్ లో నవీకరించి పట్టా పాస్ పుస్తకం మంజూరు చేయాలని, తాండూర్ మండలం బోయపల్లి గ్రామానికి చెందిన ఎలిగేటి సాయికుమార్ తమ తాతల నుంచి వారసత్వంగా వస్తున్న భూమిని తమకు ఎలాంటి సమాచారం లేకుండా కొందరు విక్రయించారని, కన్నెపల్లి మండలం సాలిగాం గ్రామానికి చెందిన తాళ్లపల్లి నరేష్ తాను రిజిస్టర్ డాక్యుమెంట్ ద్వారా కొనుగోలు చేసిన భూమిని తన పేరిట ఆన్లైన్ లో నమోదు చేయాలని కోరుతూ అర్జీలు సమర్పించారు. దండేపల్లి మండల కేంద్రానికి చెందిన గుండా రవీందర్ తల్లితండ్రుల పోషణ చట్టం ప్రకారం ప్రభుత్వ ఉద్యోగి అయినా తన కుమారుని నుంచి ప్రతినెల నగదు ఇప్పించి ఆదుకోవాలని దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణానికి చెందిన కొత్త మాధవి, కొత్త కిరణ్ మానసిక దివ్యాంగులు అయిన తమకు పెన్షన్ ఇప్పించాలని అర్జీలు అందజేశారు. మంచిర్యాల పట్టణం తిలక్ నగర్ కు చెందిన లింగన్నపేట సత్యనారాయణ తనకు వృద్ధాప్య పింఛన్ ఇప్పించాలని, లక్షెట్టిపేట మండలం పోతపల్లి గ్రామానికి చెందిన ఆవునూరి రాయలింగు తనకు గల భూమి ప్రభుత్వ రికార్డులలో తప్పిపోయిందని, నమోదు చేసి పట్టా ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్ర మంలో అందిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించే దిశగా అధికారుల సమన్వ యంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక ఫర్టిలైజర్ షాపు ప్రారంభోత్సవం



**ఆదిలాబాద్:** ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన వినాయక ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్ దుకాణాన్ని సోమవారం ప్రారంభించారు. తలమడుగు మండలం లింగి గ్రామానికి చెందిన రాకేష్ ఈ నూతన వ్యాపార సంస్థను స్థాపించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయడం అభినందనీయమని అన్నారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని కోరారు. అనంతరం షాపు యజమాని రాకేష్కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ బోథ్ నియోజక వర్గ అధ్యక్షులు బద్దం పోతారెడ్డి, ఎన్ఎస్యూఐ నాయకులు సద్దాం పాల్గొన్నారు.

# ఇంద్రవెల్లి అమరులకు మాజీ ఎంపీ నివాళి



**ఆదిలాబాద్:** ఇంద్రవెల్లిలోని అమరవీరుల స్థూపం వద్ద మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే, రాజ్ గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు సోయం బాపూరావు నివాళులర్పించారు. సోమవారం ఇంద్రవెల్లి అమరుల స్మృతి చిహ్నం వద్దకు చేరుకున్న ఆయన ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటగా 'రగల్ జెండా'ను ఆవిష్కరించి అమరుల త్యాగాలను స్మరించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఇంద్రవెల్లి కాల్పుల సంఘటన జరిగి నేటికి 45 ఏళ్లు పూర్తయ్యాయని గుర్తు చేశారు. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా అమరుల సంస్మరణ కార్యక్రమాలను నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గత పాలకుల నిర్లక్ష్యంతో ఆదివాసీ ప్రాంతాలు వెనుకబడ్డాయని, ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదిలాబాద్ జిల్లాపై, ముఖ్యంగా ఆదివాసీల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించడం శుభపరిణామమని కొనియాడారు. వచ్చే నెలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాలో పర్యటించనున్నారని, ఆ సమయంలో ఆదివాసీల పెండింగ్ సమస్యలను నేరుగా ఆయన దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని సోయం బాపూరావు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్, ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షులు ఆత్రం సుగుణ, రాజ్ గోండ్ సేవా సమితి నాయకులు, ఆదివాసీ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, ఆదివాసీలు పాల్గొన్నారు.

# వివాహ వేడుకకు హాజరైన డీసీసీ అధ్యక్షులు



**సాత్నాల:** సాత్నాల మండలం పాటగూడ గ్రామంలో సోమవారం జరిగిన కినక శ్యామరావు కుమారుని వివాహ మహోత్సవానికి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. అంతకుముందు గ్రామానికి చేరుకున్న ఆయనకు కినక శ్యామరావు కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. డీసీసీ అధ్యక్షుడిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సంజీవ్ రెడ్డి, మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గంద్రత్ సుజాత, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్యాల కరుణాకర్, కార్యదర్శి ప్రభాకర్, జిల్లా నాయకులు దౌలత్ రావు, చంద్రశేఖర్, సాత్నాల మండల కాంగ్రెస్ నాయకులు సోయం తులసిరామ్, మాజీ ఎంపీటీసీ భూమన్న, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# పట్టణ సుందరీకరణకు ప్రత్యేక చర్యలు

- **రూ.3.14 కోట్లతో ఖానాపూర్ చెరువు పునరుద్ధరణకు భూమి పూజ**



**ఆదిలాబాద్:** ఆదిలాబాద్ పట్టణ సుందరీకరణలో భాగంగా ఖానాపూర్ చెరువు పునరుద్ధరణ పనులకు మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ శ్రీకారం చుట్టారు. అమృత్–2 పథకంలో భాగంగా పబ్లిక్ హెల్త్ విభాగం ద్వారా కేటాయించిన రూ.3.14 కోట్ల నిధులతో చేపట్టనున్న ఈ పనులకు ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎంపీ గోడం నగేష్తో కలిసి సోమవారం ఆమె భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ ఆదిలాబాద్ పట్టణ రూపురేఖలను మార్చేందుకు తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు. పట్టణంలోని 49 వార్డుల సమగ్ర అభివృద్ధి కోసం సుమారు రూ.100 కోట్ల నిధులు త్వరలోనే మంజూరు కానున్నాయని చెప్పారు. ఈ నిధులతో అన్ని వార్డుల్లో నాణ్యమైన బీటీ, సీసీ రోడ్ల నిర్మాణం, మురుగునీటి పారుదల కోసం నూతన నాళాలు, కాలువల నిర్మాణం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఈ నిధులతో అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఖానాపూర్ చెరువును ఆహ్లాదకరమైన ప్రాంతంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఈఈ అరుణ్ కుమార్, స్థానిక మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# ఇసుక వాహనాల తనిఖీ



**ఆసిఫాబాద్:** ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని పెద్దవాగు సమీపంలో జీపీఓ సరోజన సోమవారం ఇసుక వాహనాలను తనిఖీ చేశారు. ఆన్లైన్ నమోదు లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకొని జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఇసుక రవాణా కోసం తప్పనిసరిగా "మన ఇసుక వాహనం"యాప్ ద్వారా ముందస్తుగా బుకింగ్ చేసుకోవాలని సూచించారు. అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు నిరంతర తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



**సత్తుపల్లి:** సత్తుపల్లి నియోజకవర్గం వేంసూరు మండలంలోని మర్లపాడు గ్రామంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సోమవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనందబాబు ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కేంద్రం ప్రారంభంతో స్థానిక రైతులకు తమ పంటను సులభంగా, న్యాయమైన ధరలకు విక్రయించే అవకాశం లభించిందని తెలిపారు. రైతుల సంక్షేమమే తమ ప్రాధాన్యత అని పేర్కొన్నారు. రైతులు మధ్యవర్తులపై ఆధారపడకుండా నేరుగా పంటను విక్రయించే విధంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని అన్నారు. భవిష్యత్తులో రైతులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కొనుగోలు కేంద్రం ప్రారంభంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు తమ పంటను తక్కువ ధరలకు అమ్ముకోవాల్సి వచ్చిందని, ఇప్పుడు సరైన మద్దతు ధర లభిస్తుందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కేంద్రం ద్వారా ఆర్థికంగా ఊరట లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పుచ్చకాయల సోమిరెడ్డి, గొర్ల సంజీవరెడ్డి, స్థానిక సర్పంచ్, పీఐసీ విశ్వజిత్, ఏఈఓ ఎస్.సందీప్, ఇంచార్జి రాంపుల్లయ్య, సెక్రటరీ సూర్యప్రకాశ్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# జన్మదినం సందర్భంగా వృద్ధులకు అన్నదానం



**సత్తుపల్లి:** సత్తుపల్లి నియోజకవర్గం వేంసూర్ గ్రామ సర్పంచ్ మహమ్మద్ ఫకృద్దీన్ తనయుడు ఎండి. శంశొద్దీన్ జన్మదిన సందర్భంగా సోమవారం గ్రామంలోని వృద్ధుల శరణాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు అన్నదానం చేసి, వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా శంశొద్దీన్ మాట్లాడుతూ సమాజంలో వృద్ధులను గౌరవించడం ప్రతిఒక్కరి బాధ్యత అని తెలిపారు. జన్మదినాన్ని సేవా కార్యక్రమంతో జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. వృద్ధులు శంశొద్దీన్ను దీర్ఘాయుష్షు కలగాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు, గ్రామ పెద్దలు, యువకులు, స్థానికులు పాల్గొన్నారు.

# నోరు ఉందని మాజీ మంత్రి కొప్పుల ఇష్టమొచ్చినట్టు మాట్లాడటం సరికాదు..

- అక్కపల్లి లిఫ్ట్ తో పాటు రోళ్లవాగు మిగిలిన ప్రాజెక్టులు పూర్తి చేస్తాం..
- నియోజకవర్గంలోని సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం..
- చివరి ఆయకట్టు వరకు సాగునీటిని అందించడం లక్ష్యం..
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..



**ధర్మపురి, ఏప్రిల్ 20:** ధర్మపురి నియోజకవర్గంలో రోళ్లవాగు, అక్కెపెల్లి ఎత్తిపోతల పథకంతో పాటు నియోజకవర్గంలో పెండింగ్ లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు సాగునీటిని అందించే బాధ్యత తాను తీసుకుంటానని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. సోమవారం నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి అక్కెపెల్లి ఎత్తిపోతల పథకాన్ని మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ధర్మపురి నియోజకవర్గంలో 90 శాతం మంది వ్యవసాయ ఆధారితంగా జీవనం సాగిస్తున్నారని అన్నారు. నియోజకవర్గంలోని రైతులకు సాగునీటిని అందించడానికి రోళ్ళవాగుతో పాటు అక్కెపల్లి ఎత్తిపోతల పథకం, వెల్గటూర్ చెరువు, స్తంభంపల్లి, రంగదామంపల్లి, యశ్వంతరావుపేట చెరువు కూడికతీత పనులు పూర్తి చేసి నియోజకవర్గంలో ని ప్రతి ఎకరాకు సాగునీటిని అందిస్తానని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. రైతుల ప్రయోజనమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టుల విషయంలో కేవలం కాగితాలకు మాత్రమే పరిమితమైందని అన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే పనులు ప్రారంభించి అంచనాలు పెంచి మధ్యలోనే నిలిపివేశారని మంత్రి ఆరోపించారు. నియోజకవర్గంలోని రైతులకు సాగునీటిని అందించే రోళ్ల వాగు ప్రాజెక్ట్ భూ సేకరణ చేయకుండానే పనులు ప్రారంభించారని మంత్రి అన్నారు.

**రోళ్లవాగు ప్రాజెక్ట్ విషయంలో**

ధర్మపురి మాజీ ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్ రూ. 60 కోట్ల అంచనాలతో 2016లో ప్రారంభించి రూ. 140 కోట్లకు పెంచారని మంత్రి ఆరోపించారు. అంచనాలు పెంచిన ప్రాజెక్టు నిర్మాణం ఎందుకు పూర్తి కాలేదో మాజీ మంత్రి కొప్పుల సమాధానం చెప్పాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ డిమాండ్ చేశారు. రిజర్వ్ ఫారెస్ట్ అనుమతి లేకుండానే రోళ్లవాగు ప్రాజెక్టు ప్రారంభించారని మంత్రి అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత రోళ్ళవాగు ప్రాజెక్టు రిజర్వ్ ఫారెస్ట్ అనుమతులు తీసుకువచ్చి ఇందుకు సంబంధించి ఆడవిశాఖకు రూ.31 లక్షలు చెల్లించినట్లు మంత్రి తెలిపారు. నోరు ఉందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడితే సహించేది లేదని మంత్రి హెచ్చరించారు. అక్కపెల్లిఎత్తిపోతలకు సంబంధించి కనీసం డ్రాయింగ్ పనులు చేయించలేని కొప్పుల ఈశ్వర్ తనపై తప్పుడు ఆరోపణ చేస్తున్నారని మంత్రి అన్నారు. వారం రోజుల క్రితం అక్క పెల్లి ఎత్తిపోతలకు సంబంధించి డ్రాయింగ్ పనులు పూర్తి అయ్యాయని మంత్రి తెలిపారు. త్వరలోనే అక్కపెల్లి రిజర్వాయర్ పనులు ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. పత్తిపాక రిజర్వాయర్ పై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ప్రాజెక్టుగా నామకరణం చేసి పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణం చేస్తానని చెప్పిన మాటలు ఏమయ్యాయి అని మంత్రి ప్రశ్నించారు. ధర్మపురి నియోజకవర్గంలో మేడారం రిజర్వాయర్, కాళేశ్వరం ప్రాజెక్ట్ పేస్ -2లో భాగంగా వందల ఎకరాల భూములు సేకరించి స్థానిక రైతులకు చుక్కనీరు ని ఇవ్వలేదని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గత ప్రభుత్వంలో చేసిన పనులకు బిల్లులు చెల్లించకుంటే తాను ఎమ్మెల్యే అయిన తర్వాత గతంలో చేసిన పనులకు బిల్లులు ఇప్పించి పనులు కొనసాగే విధంగా చర్యలు తీసుకుంటున్నానని మంత్రి తెలిపారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డితో చర్చించి నియోజకవర్గంలోని పెండింగ్ పనులు పూర్తిచేసి రైతులకు అండగా నిలుస్తామని మంత్రి తెలిపారు. మంత్రి వెంట పలువురు కాంగ్రెస్ నాయకులతో పాటు రైతులు ఉన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్ లో ఉంచొద్దు



**కలెక్టర్ చిత్రా మిశ్రా**

**కరీంనగర్, ఏప్రిల్ 20:** ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా.. వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి నిర్వహించారు. అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే (స్థానిక సంస్థలు), ఆర్డీవోలు రమేష్ బాబు, మహేశ్వర్ తో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. ప్రజావాణికి మొత్తం 238 దరఖాస్తులు రాగా.. అత్యధికంగా కరీంనగర్ నగరపాలిక సంస్థ నుంచి 59 వచ్చాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

## క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



**మంథని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అంకరి కుమార్**

**మంథని, ఏప్రిల్ 20 :** జర్నలిస్టుల పిల్లలు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మంథని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అంకరి కుమార్ అన్నారు. మంథని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో చదివి ఇంటర్మీడియట్ పరీక్షల్లో 975 అత్యధిక మార్కులు సాధించిన సీనియర్ జర్నలిస్ట్ పెండ్యాల రామ్ కుమార్- అనిత దంపతుల కుమార్తె పెండ్యాల శ్రీనిధి ని ప్రెస్ క్లబ్ మంథని సభ్యులు వారి కుటుంబ సభ్యులు ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించి శ్రీనిధి ని అభినందించి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు అంకరి కుమార్, పోతరాజు సమ్మయ్య లు మాట్లాడుతూ చదువుతోనే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని, ప్రణాళిక బద్ధంగా చదివి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని జర్నలిస్టుల పిల్లలకు సూచించారు. మార్కులు కొలమానంగా కాకుండా సాంకేతిక పరిజ్ఞానంతో పాటు ప్రపంచ స్థాయి విజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. మంథని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శ్రీనిధి లాంటి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడంలో అధ్యాపకులు ప్రముఖ పాత్ర పోషించారని వారిని కూడా అభినందిస్తున్నామన్నారు. శ్రీనిధి ప్రపంచస్థాయి పోటీ తత్వాన్ని అలవరచుకోని విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు, వారి కుటుంబాలు టెన్షన్ నుండి రిలీఫ్ అయి సరదాగా గడిపారు. సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఆనందించారు. అందరూ కలిసి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు బర్ల సంపత్, సహాయ కార్యదర్శి గంధం ఆంజనేయులు, కోశాధికారి తగరం రాజు, సీనియర్ పాత్రికేయులు కొమురోజు మారుతి, కొమురోజు చంద్రమోహన్, అంకరి ప్రకాష్, కంది కృష్ణారెడ్డి, ఆర్ల బాపు, లక్కాకుల నాగరాజు, ఒజ్జల శ్రీనివాస్, బాసాని సాగర్, కేసారపు రవి లతో పాటు జర్నలిస్టుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## తెలంగాణ ఎన్జీవోల సంఘం ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ, చలివేంద్రం ఏర్పాటు..

**ప్రారంభించిన జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఐ ఏ ఎస్..**



**కరీంనగర్, ఏప్రిల్ 20:** కరీంనగర్ తెలంగాణ ఎన్జీవోల సంఘం, కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి హాజరైన ప్రజల కోసం ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించబడింది. ఇదే సందర్భంలో కరీంనగర్ జిల్లా రెవెన్యూ అసోసియేషన్ తరఫున స్థానిక కలెక్టరేట్ కార్యాలయం ప్రాంగణంలో చలివేంద్రం ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఐ ఏ ఎస్ తమ చేతుల మీదుగా ప్రారంభించారు. చలివేంద్రం మరియు ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రాలను ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ, ఇటీవలి కాలంలో ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా ప్రజావాణి కార్యక్రమాలకు దూర ప్రాంతాల నుండి వచ్చే ప్రజలు ఎండలో గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని, వారి దాహార్తిని తీర్చడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. చల్లని తాగునీరు, మజ్జిగ వంటి పదార్థాల పంపిణీ ప్రజలకు ఉపశమనం కలిగిస్తుందని ఆమె అన్నారు. అదేవిధంగా ఉద్యోగులు కూడా ఎండల ప్రభావంతో అలసటకు గురవుతున్నారని, చలివేంద్రం ఏర్పాటు చేయడం వారికి కూడా ఎంతో ఉపయుక్తమని తెలిపారు. సమాజ సేవా భావంతో ఈ కార్యక్రమాలను నిర్వహించిన సంఘ నాయకులను అభినందిస్తూ, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవోల జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ,

మండుతున్న ఎండల్లో ప్రజలు మరియు ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే రెవెన్యూ క్లబ్ సెక్రటరీ విజయ్, ఏవో సుధాకర్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయబడిందని, దానిని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఐఏఎస్ చేతుల మీదుగా ప్రారంభింప చేయడం జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి, గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు మడిపల్లి కాళీ చరణ్ గౌడ్, ఆర్డీవో కే. మహేశ్వరరావు, ఏవో గడ్డం సుధాకర్, తహసీల్దార్లు నరేందర్, రాజేష్, రెవెన్యూ అసోసియేషన్ కార్యదర్శి విజయకుమార్, జిల్లా కోశాధికారి కిరణ్ కుమార్ రెడ్డి, కేంద్ర సంఘం నాయకులు రాగి శ్రీనివాస్ గౌడ్, ప్రభాకర్ రెడ్డి, సర్దార్ హరేందర్ సింగ్, పట్టణ అధ్యక్షులు మారుపాక రాజేష్ భరద్వాజ్, కార్యదర్శి వెలిచాల సుమంతరావు, రూరల్ అధ్యక్షులు వాస్తవిక్ గౌడ్, కార్యదర్శి కొమ్మెర శ్రీనివాస్ రెడ్డి, మహిళా నాయకులు శారద, సబిత, సునీత, హరిప్రియ, సూర్య, పెన్షన్ సంఘం నాయకులు పెండ్యాల కేశవరెడ్డి, మోసం అంజయ్య, జిల్లా నాయకులు గోవిందపతి శ్రీనివాస్, కొండయ్య, శంషుద్దీన్, కమలాకర్, కరుణాకర్ తదితర సంఘ నాయకులు, ఉద్యోగులు మరియు అధికారులు పాల్గొన్నారు.

# భీమాతోనే అందరికీ ధీమా

**ఎస్ బీ ఐ మేనేజర్ అశోక్ చౌహాన్**




**మంథని, ఏప్రిల్ 20 :** ప్రతి ఒక్కరికి బీమా అనేది ఉండాలని, బీమా ఉంటేనే ధీమాగా ఉండొచ్చని ఎస్బిఐ బ్యాంకు మంథని మేనేజర్ అశోక్ చౌహాన్ అన్నారు. సోమవారం బ్యాంకులో ప్రధానమంత్రి జీవన జ్యోతి భీమా యోజన పథకం కింద లబ్ధిదారులకు రెండు లక్షల రూపాయల చెక్కును అందజేశారు. మంథని విడ్స్ ఆర్గనైజషన్ ఆర్ బీ ఐ వారి ఆర్థిక అక్షరాష్యత కేంద్రం సహకారంతో ఖాతాదారుడు సాబుద్దీన్ 436 చెల్లింపు చేశాడన్నారు. అనారోగ్య కారణాల వల్ల సబుద్దీన్ చనిపోవడంతో కుటుంబ సభ్యులకు చెక్కు అందించారు. ఈ కార్యక్రమంలో విడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్స్ అశోక్, పూజిత, అమ్మకుంటి సుధాకర్ పాల్గొన్నారు.

## విశ్వహిందూ పరిషత్ నూతన మంథని ప్రకండ అధ్యక్షుడిగా రావుల సతీష్



**మంథని, ఏప్రిల్ 20:**గోదావరిఖనిలోని శారదా నగర్ విశ్వ హిందూపరిషత్ భవన్ లో పెద్దపల్లి జిల్లా విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యం లో జరిగిన అభ్యాస వర్గ కార్యక్రమంలో మంథని ప్రకండ అధ్యక్షులు మరియు మిగిలిన బాధ్యులను తెలంగాణ ఉపాధ్యక్షులు న్యాలకొండ భాస్కర్ రావ్ మరియు కరినగర్ విభాగ్ కార్యదర్శి అయోధ్య రవీందర్ ప్రకటించారు. మంథని ప్రకండ ఉపాధ్యక్షులుగా, మదాడి నరేందర్ రెడ్డి, బోట్ల ఆంజనేయులు, దొరగోర్ల రవీందర్, సత్సంగ ప్రముక కొమురవెల్లి హరీష్ గుప్తా.ప్రధానకార్యదర్శి గా వడ్లకొండ శ్రావణ్ .సహా కార్యదర్శిగా గుండా శ్రీనివాస్ .కజ్జం శ్యామ్.. సత్సంగ్ సేవా ప్రముఖ్ సాయ షణ్ముఖ.. ప్రచార ప్రముఖ్ తూర్పాటి రాము. గోరక్ష ప్రముఖ్ నూక శ్రీనివాస్. మందిర్మట్ ప్రముఖ్ మెడగొని రాజమౌళి గౌడ్. ఈ కార్యక్రమంలో విశ్వ హిందూపరిషత్ పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షులు కొత్త శ్రీనివాస్ గుప్తా మరియు జిల్లా కార్యదర్శి నాగులమల్యాల సత్యం, జిల్లా సహ కార్యదర్శి అడిగొప్పుల రాజు, బజరంగదల్ జిల్లా సంయోజక్.సంపత్ పాల్గొన్నారు. ఈ బాధ్యతలకు సహకరించిన పెద్దపల్లి జిల్లా కార్యదర్శి నాగులమల్యాల సత్యం జి కి మరియు ఉపాధ్యక్షులు కొత్త శ్రీనివాస్ గుప్తాకి ధన్యవాదములు తెలిపారు..

## మెగా ఉచిత హెల్త్ క్యాంప్..



**కరీంనగర్, ఏప్రిల్ 20:** కరీంనగర్‌లోని వాసుదేవ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ మరియు అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 137A సంయుక్త ఆధ్వర్యంలో మెగా ఉచిత హెల్త్ క్యాంప్ విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఉచితంగా లివర్ ఫంక్షన్ టెస్టులు (LFT) నిర్వహించబడగా, సుమారు 100 మంది రోగులు క్యాంప్‌లో పాల్గొన్నారు. వీరిలో 56 మంది రోగులకు ఉచిత సీరం LFT పరీక్షలు (ప్రతి ఒక్కటి సుమారు రూ.600 విలువైనవి) చేయబడినాయి. ఈ పరీక్షల ద్వారా ముగ్గురు పచ్చ కామెర్ల (జాండిస్) రోగులను గుర్తించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్ గారు మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం ఏప్రిల్ 19న జరుపుకునే వరల్డ్ లివర్ డే సందర్భంగా ఈ క్యాంప్‌ను ఏప్రిల్ 20న నిర్వహించినట్లు తెలిపారు. భవిష్యత్తులో ప్రతి మూడు నెలలకు ఒకసారి, సంవత్సరానికి నాలుగు సార్లు ఇలాంటి ఉచిత హెల్త్ క్యాంప్‌లను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అదనంగా, త్వరలో లివర్ ఫైబ్రోస్కాన్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ప్రజలు ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లు అలవరచుకోవాలని, మద్యపానం తగ్గించాలని, ప్రతిరోజూ కనీసం 45 నిమిషాలు వ్యాయామం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అలయన్స్ క్లబ్ నాయకులు డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, ఇంజనీర్ కోల అన్నా రెడ్డి, జిల్లా గవర్నర్ కొంజర్ల మహేష్, సుద్దపెల్లి ప్రసాద్, విద్యాసాగర్ రెడ్డి, పుల్లాల శ్యామ్, అబ్కారీ శాఖ S.I గొర్ల రాజేష్, కానిస్టేబుల్ జీవన్, నాగేశ్వర్, కుమారస్వామి, ఆచివర్స్ వెంకటేశ్వర్లు, నాగరాజు, సుధాకర్, టీవీ రావు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. అలాగే అలయన్స్ క్లబ్ ఇల్లంతకుంట అధ్యక్షుడు నర్సయ్య, కార్యదర్శి బాలరాజు, అల్లాడి ఆనంద్ కుమార్, అలయన్స్ క్లబ్ మానేరు ప్రతినిధి బత్తిని శ్రీనివాస్, జాయింట్ PRO అడ్వకేట్ హర్జీత్ సింగ్ తదితరులు హాజరయ్యారు.

# అద్వైత మత స్థాపకులు ఆదిశంకరులు

## వైశాఖ శుక్ల పంచమి శంకర భగవత్పాదుల జయంతి



(ఈద మధుకర్, సీనియర్ జర్నలిస్ట్)

"శంకారూపేణ మచ్చిత్తం పంకీకృతవ-
ఽభూద్యయా, కింకరీ యస్య సా మాయా
శంకరాచార్యమాశ్రయే"...

"సదాశివ సమారంభాం శంకరాచార్య
మధ్యమాం, అస్మదాచార్య పర్యంతాం
వందే గురు పరంపరాం"

వేదాలలో ఉపనిషత్తులలో, భగవద్గీతలో ఉన్నదే అయినప్పటికీ, ప్రజలు మరిచిపోయిన అంశాలను తిరిగి ఉటంకిస్తూ, బౌద్ధ మతం లోని మంచి సిద్ధాంతాలను చేర్చి, అద్వైత మత స్థాపన ఆచార్యుడైనాడు ఆదిశంకరుడు. తూర్పున పూరీ జగన్నాథంలో గోవర్ధన మఠం, పశ్చిమాన ద్వారకలో కాళికా (శారదా)మఠం, ఉత్తరాన బదరీ కేదారంలో జ్యోతిర్మఠం, దక్షిణ దిశలో శృంగేరి యందు శృంగగిరి శారదా మఠం స్థాపించి, మత కార్యనిర్వాహణ కోసం, దేశం నలు చెరుగులా సంచరించి, అద్వైత తత్వాన్ని వివరించి, దిగ్విజయ యాత్ర కొనసాగించారాయన. సమకాలీన హైందవ మతంపై అత్యంత ప్రభావం కలిగిన సిద్ధాంతవేత్త ఆయన. హిందూ మతాన్ని ఉద్ధరించిన త్రిమతా చార్యులలో ప్రథములు ఆది శంకరులు. క్రీస్తుశకం 788 – 820 మధ్య శంకరులు జీవించి ఉంటారని ఒక భావన.

"దుష్టాచార వినాశాయ ప్రాదుర్భూతో మహీతలే, న ఏవ శంకరాచార్య సాక్షాత్ కైవల్య నాయక:" దుష్టాచారాలను, నశింప చేసేందుకై, కైలాస నాథుడే ఆది శంకరుని రూపంలో అవతరించారని "శివ న్యాసం" స్పష్ట పరుస్తున్నది.

"కరిష్యత్సవతారం స్వం శంకరో నీల లోహిత: శ్రౌత, స్మార్త ప్రతిష్ట అర్థం భక్తానాం హిత కామ్యయా". శ్రౌత స్మార్త ప్రతిశ్టార్థం భక్తానాం హిత కామ్యయా. శ్రౌత స్మార్త క్రియలను సుప్రతిష్టితం చేసి, వైదిక మార్గాన్ని సక్రమంగా నిలబెట్టడానికి, త్రినేత్రుడు స్వయంగా శంకరుల రూపంలో అవతరించారని కూర్మపురాణం విశదీకరిస్తుంది. త్రిచూర్ లోని వృషాచల పర్వతం పై గల శివున్ని ప్రార్థించి ఆయన అనుగ్రహం పొందిన, కృష్ణ యజుర్వేద శాఖకు చెందిన, నంబూద్రి బ్రాహ్మణ దంపతులైన ఆర్యాంబ, శివగురువులకు, కేరళలోని పూర్ణ నది తీరాన గల కాలడిలో, ఉత్తరాయణ పుణ్య కాలమున వైశాఖ శుక్ల పంచమి నాడు, శివుని జన్మ నక్షత్రమైన ఆరుద్రలో, సూర్యుడు శని, గురుడు, కుజుడు ఉచ్ఛ స్థితిలో ఉండగా శంకరులు జన్మించారు. మూడవ యేటనే తండ్రిని కోల్పోయిన శంకరులకు ఐదవ యేట ఉపనయన సంస్కారము జరిగింది. బ్రహ్మచర్య దీక్షలో భాగంగా మాధుకరం కోసం భిక్షాటనకు వెళ్లిన శంకరులకు ఒక పేద బ్రాహ్మణుని యింటి యిల్లాలు వద్ద ఉసిరికాయ తప్ప ఏమీ దొరకలేదట. ఆమె దుస్థితికి కరిగిన శంకరులు లక్ష్మీదేవిని కనకధారా స్తోత్ర రూపంలో ప్రార్థించగా ఆ తల్లి కరుణించి ఆ ఇంట బంగారు ఉసిరికలు కురిపించి వారి దారిద్ర్యాన్ని పోగొట్టిందట.

సన్యాసం తీసుకోవడానికి తల్లిని అనుమతి కోరగా, ఆమె నిరాకరించగా ఒక నాడు, పూర్ణా నదిలో స్నానమాచరించే సమయాన, మొసలి పట్టుకోగా, మరణించే లోగా నైనా సన్యాసిగా ఉంటానని, తల్లిని కోరగా, ఆమె అంగీకారంతో సన్యాసిగా మారే మంత్రం పఠిస్తూ ఉండగా, మొసలి శంకరులను వదిలేసింది. వ్యాస కుమారుడైన, శుకుని శిష్యులైన, గౌడపాదుల శిష్యుడైన, గోవింద భగవత్పాదుల నర్మదా తీర గుహ దర్శనం లభించింది.

తల్లి అనుమతితో సన్యాసం స్వీకరించి శంకరులు భారత దేశ యాత్ర మొదలు పెట్టారు. ఉధృతంగా ప్రవహిస్తున్న నర్మదా నదిని తన కమండలములో బంధించిన శంకరుని చూసి ముగ్ధులైన గురు గోవింద భగవత్పాదులు శంకరులను తన శిష్యునిగా స్వీకరిస్తారు.

గోవింద పాదులు జ్ఞాన సమాధి నుండి చూసి, సాక్షాత్తూ భువికి దిగివచ్చిన పరమ శివుడే శంకరుడు అని అన్నారు. శంకరులు మొదటి సారిగా, గోవింద భగవత్పాదులకు పాదపూజ చేయగా, నేటికీ ఆ పరంపర కొనసాగుతూనే ఉంది. గురుసేవ తోనే జ్ఞానార్జన సాధ్యమని, ప్రపంచానికి ఆయన చాటారు. వారణాసిలో సదానందుడు శంకరుని మొదటి శిష్యులయ్యారు. గంగా నది వైపు వెళుతున్న సమయంలో, నాలుగు శునకాలతో, చండాలుడు అడ్డు రాగా, చండాలుని మాటలు విన్న శంకరుడు... పరమశివుడే చతుర్ వేదాలతో వచ్చాడని గ్రహించి, మనీషా పంచక స్తోత్రం చేసి, బ్రహ్మ సూత్రాలకు బాష్య సూత్రాలు రాసి, సిద్ధాంతం వ్యాప్తికి, సంరక్షణకు దేశవ్యాప్తంగా శిష్యులను పంపాలని, శివుని ఆదేశం పొంది, కర్తవ్య ముఖులైనారు శంకరులు. ఎనిమిది రోజుల చర్చ అనంతరం, వ్యాస భగవానుని సంతృప్తిపరచి, ఆయుర్థాధిక వరం పొందారు. శంకరులు సన్యాసం తీసుకున్నాక, కొత్త పేరును సూచించే యోగ పట్టం... తీర్థ, ఆశ్రమ, వన, గిరి, అరణ్య, పర్వత, సాగర, సరస్వతి, భారతి, పురి అనే పది పేర్లను, శంకరుడు మఠం నిర్వాహకులకు నిర్ణయించారు. సాంఖ్య, బౌద్ధ, జైన, వైశేషిక వాదాలను, వేదాంత విరుద్ధ హిందూ భావజాలాన్ని ఖండించి, ఉపనిషత్తుల ఆధారంగా, అద్వైత మతాన్ని నిరూపణ చేసేందుకు స్వానుభవాన్ని జోడించి, తర్కానికి ప్రముఖ స్థానం కల్పించి, భాష్యాలు, ప్రకరణ గ్రంధాలు, స్తోత్రాలు రచించారు. ఆత్మ , బ్రహ్మం (పరమాత్మ) ఒకటే అనేది అద్వైత మూలసూత్రం. ఇందుకు మౌలిక సూత్రాలను, ఉపనిషత్తులు, భగవద్గీత, బ్రహ్మ సూత్రాలు, ప్రస్థాన త్రయం నుండి ఆయన గ్రహించారు. క్షీణ దశలో ఉన్న హిందూ మతాన్ని పునరుద్ధరించి, వివిధ శాఖల పండితులను ఓడించి, తన సిద్ధాంతాన్ని ఒప్పించి, భగవంతుని నమ్మే వారందరినీ ఏకీకృతుల చేసి వేదాలలో విశ్వాసాన్ని, హిందువులలో ఆత్మ విశ్వాసాన్ని పెంచారు. బ్రహ్మచర్యాశ్రమం నుండే సన్యాసం స్వీకరించారు. సన్యాసి అయి ఉండి, తల్లికి అంత్యక్రియలు నిర్వహించి, డెబ్బై రెండు మతాల వారిని జయించి, సూత్ర భాష్య శతాధిక ఉద్గ్రంతాలు రచించి, బ్రహ్మసూత్రాల భాష్య కారుడై, కైలాస నాథుని అనుగ్రహం వల్ల జన్మించి, "సుఖం కలిగించు వాడు" అనే అర్థముతో "శంకర" నామాంకితులై, 32 ఏళ్ళకే, కైలాస గమనం చేసిన శంకరునికి ప్రత్యేకతలున్నాయి. నువ్వు వేరు... నేను వేరు' అనే సంకుచిత మార్గం నుండి 'అందరమూ ఒకటే' అన్న విశాల మార్గంలోకి రప్పించిన వేదాంతి. 'జీవుడే బ్రహ్మం... బ్రహ్మమే జీవుడు. ఆ ఇద్దరికీ తేడాలేదు. చుట్టూ కనిపించేదంతా మాయ మాత్రమే. అజ్ఞానం లోనుండి బయటపడి తనను తాను తెలుసుకో గలగాలి' అని ఆది శంకరుడు ఉద్బోధించారు.

ఆయన చేసిన స్తోత్రాల్లో మనీషా పంచకము, సాధన పంచకము, భజ గోవిందము, గోవిందాష్టకము, పాండు రంగాష్టకము, శివ సువర్ణ మాలా స్తోత్రము, అర్థనారీశ్వర స్తోత్రము, కాలభైరవాష్టకము, దక్షిణామూర్తి స్తోత్రము, నిర్వాణ షట్కము, అన్నపూర్ణాష్టకము, అచ్యుతాష్టకము, మహిషాసుర మర్ధిని స్తోత్రము, త్రిపురసుందరీ స్తోత్రము, భుజంగాష్టకాలు, భవాన్యష్టకము, దేవీ నవరత్న మాలికా, విశ్వనాథాష్టకము, ఉమామహేశ్వర స్తోత్రము, సౌందర్య లహరి, శివానంద లహరి, వివేక చూడామణి మొదలైనవి. ఆయన స్థాపించిన పీఠాధిపతులు కూడా శంకరాచార్య నామాన్ని అనంతర కాలంలో ఉటంకింప బడుతుండగా, ఆది శంకరులుగా చిర స్మరణీయులు అయినారు శంకర భగవత్పాదులు.

# పాలనా యంత్రాంగానికి వెన్నెముకలు పౌర సేవలు

## నేడు జాతీయ పౌర సేవల దినోత్సవం

(రామ కిష్టయ్య సంగన భట్ల, 9440595494)

**జాతీయ పౌర సేవల దినోత్సవం ఏప్రిల్ 21న దేశవ్యాప్తంగా ప్రతి ఏట నిర్వహిస్తారు.**



భారత పౌర సేవలు, (సివిల్ సర్వీసెస్) అంటే ప్రభుత్వ అధికా రులు దేశానికి, ప్రజలకు చేసే సేవలు. భారత పరిపాలనా వ్యవస్థ లో ఈ "భారత పౌర సేవలు" అతిముఖ్య రంగం. భారతీయ పార్లమెంటరీ ప్రజాతంత్ర వ్యవస్థలో పరిపాలనా బాధ్యతలను నిర్వర్తిం చే గురుతర బాధ్యత ఈ రంగానిది. ప్రజాస్వామ్యంలో ప్రజలచే ఎన్నుకోబడ్డ ప్రతినిధులు ప్రభుత్వంలో ఉంటూ మంత్రులుగా వ్యవహరిస్తారు. అలా కొద్ది మంది ప్రజా ప్రతినిధులు పరిపాలన సాగించడం సాధ్యం కాని విషయం. సేవారంగంలో గల సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనే బాధ్యతను పౌర సేవల అధికారు లు నిర్వర్తిస్తారు. ప్రభుత్వ ప్రతినిధులుగా శాసన కర్తలుగా, మంత్రులు పాలసీలను తయారు చేస్తే, సేవారంగం వాటిని అమలు పరుస్తుంది. పౌర సేవల వ్యవస్థ పరిపాలన యంత్రాంగానికి వెన్నుముక లాంటిది. ఇది రిపబ్లిక్ ఆఫ్ ఇండియా శాశ్వత కార్యనిర్వాహక శాఖ. ప్రభుత్వం రూపొందించిన విధానాలను, పథకాలను క్షేత్ర స్థాయిలో విజయ వంతంగా అమలు జరిపే బాధ్యత పౌర సేవకులదే. పౌర సేవల విభాగాలు మూడుగా విభజింప బడ్డాయి. ఇవి రాజ్యాంగ అధికారాలచే ఏర్పాటు చేయబడ్డాయి. ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఏఎస్), ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్), ఇండియన్ ఫారెన్ సర్వీస్ (ఐఎఫ్ఎస్) లతోపాటు సెంట్రల్ గ్రూప్ ఏ అండ్ గ్రూప్ బీ తదితర సర్వీసులు. ప్రస్తుతం అమలులో వున్న భారత పౌరసేవా రంగం (ఇండియన్ సివిల్ సర్వీసెస్) పూర్వ బ్రిటీషు ఇండియా భారత ప్రజా సేవ విధానాలపై ఆధారపడి భారత విభజన జరిగిన 1947 తరువాత నుండి అమలులోకి వచ్చింది.

ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, తద్వారా ప్రజలు వారివారి ప్రాథమిక హక్కులను పొందేలా చూడాలన్న ఉద్దేశ్యంతో జాతీయ పౌర సేవల సంస్థ 2016, ఏప్రిల్ 21 ఈ పౌర సేవల దినోత్సవాన్ని ప్రారంభించింది. పౌర సేవల అధికారుల పనుల కార్యక్రమాలను ప్రోత్సహిం చేందుకు, ప్రశంసిం చేందుకు పౌర సేవలం దినోత్సవాన్ని ప్రతి ఏడాది నిర్వహిస్తున్నారు. బ్రిటిష్ కాలంలోనే పౌర సేవలు అనే పదం పుట్టింది. వారన్ హెస్టింగ్స్, చార్లెస్ కార్న్ వాలిస్, ఈ సేవలకు పునాదులు వేశారు. బ్రిటిష్ రాజ్ నుంచి పూర్తిగా స్వేచ్ఛ విముక్తులైన తర్వాత అడ్మినిస్ట్రేటివ్ విధానాన్ని పరిపాలనా విభాగం చూసు కునేది. భారతీయుల పౌర సేవల స్థానంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసులను తీసుకొచ్చారు.

బ్రిటిష్ పాలనలో ఉన్న ఇండియన్ సివిల్ సర్వీస్ భారత స్వతంత్ర ప్రతిపత్తి అనంతరం ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ గా మారింది. ఏప్రిల్ 21, 1947న స్వదేశీ పార్లమెంటు సభ్యుడు సర్దార్ వ్లభాయ్ పటేల్ అఖిల భారత సేవలను ప్రారంభిం చారు. 1947లో ఢిల్లీలోని మెట్‌కాల్ఫ్ హౌస్‌లో స్వతంత్ర భారత తొలి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్ ఆఫీసర్ల ప్రొబేషనర్లను ఉద్దేశించి ప్రసంగించిన రోజు జ్ఞాపకా ర్థం ఈ తేదీని ఎంచుకున్నారు. అతను సివిల్ సర్వెంట్లను స్టీల్ ఫ్రేం (ఉక్కు చట్రం) ఆఫ్ ఇండియాగా పేర్కొన్నాడు. అటువంటి మొదటి కార్యక్రమం 21 ఏప్రిల్ 2006న న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగింది. పౌర సేవల అధికారులు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రాలు, పబ్లిక్ రంగ సంస్థలలో పట్టున్న, వ్యూహాత్మక స్థానాలున్నవారు. ఈ అధికారులు ప్రభుత్వ విధానాలను అమలు పరచి పర్యవేక్షిస్తారు.




ప్రభుత్వం వారు చేపట్టే పనులకు, విధానాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుంది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఉన్నతమైన సేవలందిం చిన వ్యక్తులకు బృందాలను పురస్కారాలను ప్రదానం చేస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన చాలా నుంది. అధికారులకు వారి అసాధారణమైన సేవలకు గుర్తింపుగా ప్రధాన మంత్రి పురస్కారాన్ని ఇస్తారు. అత్యుత్తమ సేవలను అందించిన వారికి "ప్రధాన మంత్రి "అవార్డును ఇస్తారు.

పౌర సేవల విషయంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవటానికి భవిష్యత్తులో ఎలాంటి ప్రణాళికలు రూపొందించాలోనన్న అంశంపై పౌర సేవల ఉద్యోగులకు శిక్షణా కార్యాక్రమాలు నిర్వహించ బడుతాయి. పౌర సేవల గురించి, పౌరుల హక్కుల గురించి గ్రామస్థాయిలో గ్రామస్తులకు, విద్యార్థులకు అవగాహన కలిపిస్తారు.

విశ్వవిద్యాలయ పట్టభద్రులు, పైబడి విద్యగల వారిని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యు.పి.ఎస్.సి) ఒక ప్రత్యేక పరీక్షా విధానం ద్వారా సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్, ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్ పరీక్షలు నిర్వహించి అర్హత పొందినవారిని ఆయా సేవా రంగాలలో నియమిస్తారు.

ముఖ్యమైన కార్యక్రమాలకు వినూత్న ఆవిష్కరణలకు చెందిన కేటగిరీలలో పురస్కారాలను ఇస్తుంటారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన, దీన్ దయాళ్ ఉపాధ్యాయ కౌసల్ యోజన, నమామి గంగే యోజన, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, స్వచ్ఛ భారత్, డిజిటల్ చెల్లింపుల వంటి కీలక కార్యక్రమాల అమలు ప్రాతి పదికన అవార్డుల ప్రదానం చేస్తారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమాలు నవీన భారతానికి ఎంతో కీలకంగా ఉ

# విశ్వవైద్య యవనికపై తెలుగు వెలుగు

(ఈద మధుకర్, సీనియర్ జర్నలిస్ట్)

**భారతీయ వైద్య పరిశోధనా పటిమ ప్రపంచ వేదికపై మరోసారి సగర్వంగా నిలిచింది. గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన పద్మభూషణ్ డాక్టర్ డి. నాగేశ్వర రెడ్డి, ప్రతిష్టాత్మక 'అమెరికన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మెడికల్ అండ్ బయోలాజికల్ ఇంజనీరింగ్' (AIMBE) కాలేజ్ ఆఫ్ ఫెలోస్‌కు ఎంపికయ్యారు. ప్రపంచవ్యాప్తంగా వైద్య, జీవ వైజ్ఞానిక రంగాల్లో అసాధారణ ప్రతిభ కనబరిచిన అగ్రశ్రేణి మేధావుల్లో కేవలం రెండు శాతం మందికి మాత్రమే దక్కే ఈ గౌరవం, ఒక తెలుగు వైద్యుడిని వరించడం యావత్ దేశానికి గర్వకారణం.**



### శస్త్రచికిత్సకు ప్రత్యామ్నాయంగా ఎండోస్కోపీ:

డాక్టర్ నాగేశ్వర రెడ్డి గ్యాస్ట్రో ఎంటరాలజీ రంగాన్ని కేవలం చికిత్సా విభాగంగా కాకుండా, సాంకేతికతను మేళవించిన ఆధునిక ఇంజనీరింగ్ అద్భుతంగా మార్చారు. గతంలో వ్యాధి నిర్ధారణకే పరిమితమైన ఎండోస్కోపీని, ఆయన తన పరిశోధనలతో ఒక శక్తివంతమైన శస్త్రచికిత్సా సాధ నంగా తీర్చిదిద్దారు. కోత లేకుండా, రక్తస్రావం కాకుండా క్లిష్టమైన సమస్యలను పరిష్కరించే 'థెరప్యూటిక్ ఎండోస్కోపీ'ని ఆయన ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యంలోకి తెచ్చారు. ఆయన రూపకల్పన చేసిన 'నాగి స్టెంట్' (ఛీుస్త్రఱ కొవత్) నేడు వందలాది దేశాల్లో రోగుల ప్రాణాలను కాపాడుతోంది. స్వదేశీ పరిశోధనా సామర్థ్యానికి ఈ పరికరం ఒక నిలువెత్తు సాక్ష్యం.

### హైదరాబాద్‌లో గ్లోబల్ హబ్ (AIG):

ఆసియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ (AIG) స్థాపన ద్వారా డాక్టర్ రెడ్డి హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ గ్యాస్ట్రో ఎంటరాలజీ రాజధానిగా మార్చారు. గచ్చిబౌలిలోని ఈ కేంద్రం నేడు ప్రపంచంలోనే అతిపెద్ద ఎండోస్కోపీ శిక్షణ కేంద్రాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. కేవలం విదేశీ యంత్రాలపై ఆధారపడకుండా, 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యానికి అనుగుణంగా మన దేశంలోనే వైద్య పరికరాల తయారీని ఆయన ప్రోత్సహిస్తున్నారు. ప్రస్తుతం పెరుగుతున్న కృత్రిమ మేధస్సు సాంకేతికతను ఎండోస్కోపీ స్క్రీనింగ్‌లో ఉపయోగించి, క్యాన్సర్ కణాలను ముందస్తుగా గుర్తించడంలో ఆయన చేస్తున్న కృషి అద్వితీయం. వైద్య రంగంలో ఆయన చేసిన నిరుపమాన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం ఇప్పటికే పద్మశ్రీ (2002), పద్మభూషణ్ (2016) పురస్కారాలతో సత్కరించింది. అమెరికన్ సొసైటీ ఫర్ గ్యాస్ట్రో ఇంటెస్టినల్ ఎండోస్కోపీ (ూూ+జు) నుండి అత్యున్నత పురస్కారాలు అందుకున్న తొలి భారతీయుడిగా ఆయన రికార్డు సృష్టించారు. ఇప్పుడు ఏఐఎంబీఈ గౌరవం ఆయన కీర్తి కిరీటంలో మరో కలికితురాయిగా నిలిచింది. వైద్యం అనేది వ్యాపారం కాకూడదని, అది సామాజిక బాధ్యత కావాలని నమ్మే మానవతావాది డాక్టర్ నాగేశ్వర రెడ్డి. ఏఐజీ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో అనేక ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తూ పేదలకు వైద్యాన్ని చేరువ చేస్తున్నారు. ఒక మధ్యతరగతి నేపథ్యం నుండి వచ్చి, అంతర్జాతీయ వైద్య రంగాన్ని శాసించే స్థాయికి ఎదిగిన ఆయన ప్రస్థానం యువ పరిశోధకులకు గొప్ప స్ఫూర్తిదాయకం. ప్రపంచ ఆరోగ్య పటంలో



# అసమాన మేధావి..
# శకుంతలా దేవి
## నేడు శకుంతలా దేవి వర్ధంతి

ఆమె అంక గణితంలో నిపుణురాలు. గణితావధాని. చాలా వేగంగా గణనలు చేయగల సామర్థ్యం కలిగిన ఆమెను "మానవ కంప్యూటర్" అని పిలుస్తారు. గణిత మాంత్రికురాలిగా సుప్రసిద్ధులు. శతాబ్దంలో ఆమెకు ఏదైనా తేదీ ఇస్తే, అది వారంలో ఏ రోజు పడిపోయిందో చెప్పగలిగిన అసాధారణ ప్రజ్ఞాశాలి. మైండ్ డైనమిక్స్' అని పిలిచే భావనను అభివృద్ధి చేసిన మేధావి. ఆమెనే మానవ నిర్మిత కంప్యూటర్ కన్న గొప్ప గణకురాలిగా ప్రపంచ వ్యాప్త గుర్తింపు పొందిన గణిత శాస్త్ర వేత్త శకుంతలా దేవి. శకుంతలా దేవిని (నవంబరు 4, 1929 -- ఏప్రిల్ 21, 2013 ) మానవ గణన యంత్రము అని పిలుస్తారు. ఆమె ప్రపంచ వ్యాప్తంగా అనేక గణితావధానములు నిర్వహించి గణన యంత్రము కంటే వేగంగా పలు సమస్యలను పరిష్కరించారు. ప్రపంచంలో అతి వేగంగా గణనలు చేయుటలో గిన్నిస్ వరల్డ్ రికార్డును స్వంతం చేసుకున్నారు. బెంగళూరులోని బ్రాహ్మణ పూజారుల ప్రసిద్ధ కుటుంబంలో జన్మించిన శకుంతల దేవి తన తాత నుండి గణితంలో ప్రారంభ పాఠాలు పొందారు. ఐదు సంవత్సరాల వయస్సులో ఆమె చైల్డ్ ప్రాడిజీగా మరియు సంక్లిష్ట మానసిక అంక గణితంలో నిపుణురాలిగా గుర్తించబడింది. ఆ చిన్న వయస్సులో, ఆమె క్యూబ్ మూలాలను లెక్కించటం వంటి గణిత సమస్యలను పరిష్కరించడంలో నిపుణురాలు అయ్యింది. ఒక సంవత్సరం తరువాత మైసూర్ విశ్వ విద్యాలయంలోని విద్యార్థులు, ప్రొఫెసర్ల పెద్ద సమావేశానికి వెళ్ళి ఆమె తన ప్రతిభను ప్రదర్శించింది. ఎనిమిదేళ్ల వయసులో అన్నామలై విశ్వ విద్యాలయంలో ఆమె ప్రదర్శనతో శకుంతలాదేవిని బాలమేధావిగా గుర్తించారు. శకుంతలాదేవి 1960లో కోల్ కతాకు చెందిన ఐఏఎస్ పరితోష్ బెనర్జీని వివాహం చేసుకున్నారు. బెనర్జీ స్వలింగ సంపర్కం గురించి వెల్లడి కావడంతో ఆ వివాహం త్వరలోనే విడిపోయింది. అయితే ఈ ఘటన శకుంతల దేవికి, ఉత్ప్రేరకంగా పనిచేసింది, ఆమె మానవత్వం గురించి లోతుగా పరిశోధించడానికి సహాయపడింది. 1977 లో ది వరల్డ్ ఆఫ్ హోమోసెక్సువల్స్ అనే పుస్తకాన్ని రాయడానికి ఆమెను దారితీసింది. అమె రాసిన పుస్తకంలో స్వలింగ సంపర్కం అనైతికం అనే విషయాన్ని ఆమె సవాలు చేసింది. శకుంతలాదేవి తన సామర్థ్యాలను, తన సామర్థ్యాలను ఉపయోగించు కుంటూ, తన జీవితాన్ని అన్వేషించి, మానవత్వాన్ని చాటుకునే తపనతో, తన జీవితాన్ని గురించి ప్రసంగాలలో చెబుతూ ఉండేవారు. ఆమె ఎన్నో రచనకు చేశారు. మానవ మనస్సు కంప్యూటర్ కంటే సాటిలేని సామర్థ్యాలను కలిగి ఉందని, మానవ మనస్సును కంప్యూటర్లతో పోల్చడం సముచితం కాదని ఆమె అభిప్రాయ పడ్డారు. శకుంతలా దేవి తమ గణిత ప్రతిభను ప్రదర్శిస్తూ ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలలో పర్యటించారు. ఆమె తన తండ్రితో కలిసి 1944 లో లండన్‌కు వెళ్లారు. ఆమె 1950 లో ఐరోపా పర్యటన 1976లో న్యూయార్క్ నగరంలో ప్రదర్శనలు ఇచ్చారు. 1988 లో, బర్కిలీలోని కాలిఫోర్నియా విశ్వ విద్యాలయంలో విద్యా మనస్తత్వ శాస్త్రం ప్రొఫెసర్ ఆర్థర్ జెన్సన్ వద్ద అధ్యయనం చేయటానికి ఆమె వెళ్లారు. ఆర్థర్ జెన్సెన్ స్వయంగా శకుంతలా దేవి గణిత ప్రతిభను పరిశీలించి అవాక్కయ్యారు. 1977లో అమెరికాలో ఓసారి ఒక కంప్యూటర్ తో శకుంతలా దేవికి పోటీ పెట్టారు. 188132517 అనే సంఖ్యకు మూడో వర్గం కనుక్కోవడంలో పోటీ పెట్టగా, ఆమె కంప్యూటర్ ను ఓడించారు. 1980 జూన్ నెలలో 13 అంకెలున్న రెండు సంఖ్యలు తీసుకున్నారు. 76,86,36,97,74,870 అనే సంఖ్యతో 24,65,09,97,45,779 అనే సంఖ్యను హెచ్చువేస్తే ఎంత వస్తుందని లండన్ ఇంపీరియల్ కాలేజీలోని కంప్యూటర్ విభాగంలోని ఓ సూపర్ కంప్యూటర్ శకుంతలా దేవిని ప్రశ్నించింది. దానికిఅయితే ఆమె కేవలం 28 సెకన్లలో 18,947,668,177,995,426,462,773,730.. సమాధానం ఇచ్చారు. ఆలా గిన్నీస్ బుక్ రికార్డ్ ఆమె సొంతం అయింది. ఆమె గత శతాబ్ద కాలంలో ఏ తేదీ చెప్పినా అది ఏ వారం అవుతుందో క్షణంలో ఆమె చెప్పేవారు. దేవి 1969 లో ఫిలిప్పీన్స్ విశ్వవిద్యాలయం విశిష్ట మహిళల పురస్కారాన్ని గెలుచుకుంది. ఆమె 1988 లో వాషింగ్టన్ డిసిలో రామానుజన్ మ్యాథమెటికల్ జీనియస్ అవార్డుతో సత్కరించింది. తమ 83వ ఏట 2013 ఏప్రిల్ 21న ఆమె బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో కన్ను మూశారు. గణితశాస్త్రాన్ని, ప్రాచీనకాలం నుండి ఎంతోమంది భారతీయులు అభివృద్ధి పరుస్తూ వచ్చారు. భారతీయ గణిత ఆవిష్కరణల్లో ముఖ్యమైనవిగా సున్నా వాడకం, బీజగణితం వంటివాటిని చెబుతారు. ప్రపంచంలో మేధావులుగా గుర్తించ బడిన ఆర్యభట్ట, వరాహ మిహిర కాలం నుండి అంకగణిత ప్రాధాన్యత ఉన్నప్పటికీ, ఇటీవలి సంవత్సరాలలో విద్యార్థులలో గణిత ఫోబియా అధికం అవుతుంది. ఉన్నత చదువుల కోసం గణితాన్ని ఎంచుకునే విద్యార్థుల సంఖ్య తగ్గుతున్నది. భారతదేశంలో సుమారు 1.3 మిలియన్ల పాఠశాలలు, 800 విశ్వవిద్యాలయాలను కలిగి ఉన్నా, గణిత ఉపాధ్యాయుల సంఖ్య నానాటికీ దిగదుడుపే అవుతున్నది. దేశంలో ఇంజనీరింగ్, ఉత్పత్తి, సమాచార సాంకేతికత, అంతరిక్ష తదితర శాస్త్రాలలో గణిత శాస్త్ర నిపుణులు అవసరం ఉన్న దృష్ట్యా, ప్రభుత్వాలు గణిత శాస్త్ర నిపుణులను తయారు చేయాల్సి ఉంది. అలాగే ఐదేళ్ళ నుండి 80ఏళ్ళ పైబడిన వయసు దాటే వరకు వరకు

రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్
కాలమిస్ట్...9440595494

# హిమగిరి శిఖరాన హరిహర నివాసం
## చార్‌ధాం పవిత్ర దర్శనం

(రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, 9440595494)



భారతీయ ఆధ్యాత్మిక వైభవం, హిమాలయాల అచంచల ప్రశాంతత, మరియు మానవ అంతర్మథనం కలబోసిన అద్భుత ఆధ్యాత్మిక మహాక్రతువు 'చార్ ధాం యాత్ర'. హిందూ ధర్మ శాస్త్రాల ప్రకారం, మానవ జన్మ ధన్యమవ్వాలన్నా, సంసార సాగరంలోని కర్మబంధాల నుండి విముక్తి పొంది మోక్షాన్ని ఆస్వాదించాలన్నా చార్ ధాం దర్శనం అనివార్యమని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని గర్వాల్ హిమాలయ శ్రేణులలో కొలువై ఉన్న యమునోత్రి, గంగోత్రి, కేదార్‌నాథ్, బద్రీనాథ్ అనే నాలుగు పుణ్యక్షేత్రాల సమాహారమే ఈ యాత్ర. ఇది కేవలం భౌగోళిక ప్రయాణం కాదు, భౌతిక ప్రపంచం నుండి ఆధ్యాత్మిక ప్రపంచానికి సాగే ఒక అంతర్ ప్రయాణం. ప్రాచీన కాలం నుండి నేటి ఆధునిక యుగం వరకు ఈ యాత్ర తన ప్రాముఖ్యతను నిలుపుకుంటూ, కోట్లాది మంది భారతీయుల నమ్మకానికి ప్రతీకగా నిలుస్తోంది.

చార్ ధాం యాత్ర ప్రాశస్త్యాన్ని పరిశీలిస్తే, దీని మూలాలు పురాణ కాలంలోనూ మరియు ఎనిమిదవ శతాబ్దానికి చెందిన జగద్గురు ఆది శంకరాచార్యుల కాలంలోనూ కనిపిస్తాయి. హిందూ సంస్కృతిలో 'ధామ్' అనగా దేవుని నివాసం అని అర్థం. భరతఖండం నలుమూలలా శంకరాచార్యులు స్థాపించిన నాలుగు ప్రధాన ధామ్‌లు (పూరీ, ద్వారక, రామేశ్వరం, బద్రీనాథ్) ఉన్నప్పటికీ, ఉత్తరాఖండ్‌లోని ఈ నాలుగు క్షేత్రాలను 'ఛోటా చార్ ధాం'గా వ్యవహరిస్తారు. శతాబ్దాల క్రితం హిమాలయాల్లోని దుర్గమారణ్యాల మధ్య ఉన్న ఈ ఆలయాలను ఆది శంకరాచార్యుడు పునరుద్ధరించి, భారతీయ సనాతన ధర్మాన్ని ఏకం చేసేందుకు వీటిని ప్రధాన ఆధ్యాత్మిక కేంద్రాలుగా తీర్చిదిద్దారు. నాటి నుండి నేటి వరకు, హిమాలయాలలోని ఈ ప్రాంతాలు మునులు, యోగులు మరియు తపస్వులకు నిలయంగా ఉంటూ, సామాన్య భక్తులకు మోక్షద్వారాలుగా భాసిల్లుతున్నాయి.

యాత్ర క్రమానుగత పద్ధతిని గమనిస్తే, ఇది నైరుతి నుండి ఈశాన్యం వైపునకు సాగుతుంది. సంప్రదాయం ప్రకారం యాత్రికులు తొలుత యమునోత్రిని దర్శిస్తారు. ఇది యమునా నదికి జన్మస్థానం. సూర్యపుత్రిక అయిన యమునా దేవికి అంకితం చేయబడిన ఈ ఆలయం సముద్ర మట్టానికి సుమారు 3,293 మీటర్ల ఎత్తులో ఉంటుంది. ఇక్కడ స్నానం చేయడం వల్ల యమపాశం నుండి విముక్తి కలుగుతుందని పురాణాలు చెబుతున్నాయి. అనంతరం భక్తులు గంగోత్రికి చేరుకుంటారు. ఇది భాగీరథి (గంగా) నదికి మూలస్థానమైన గోముఖానికి సమీపంలో ఉంటుంది. భగీరథుని తపస్సుకు మెచ్చి గంగమ్మ ఇక్కడే భూమికి దిగివచ్చిందని ప్రతీతి. గంగానది పవిత్రత భారతీయ జీవనశైలిలో ఎంతటి విశిష్ట స్థానాన్ని కలిగి ఉందో మనందరికీ విదితమే. ఈ రెండు నదీ మూలాలను దర్శించిన తర్వాత భక్తుల ప్రయాణం అత్యంత కఠినమైన, పవిత్రమైన కేదార్‌నాథ్ వైపు సాగుతుంది.

కేదార్‌నాథ్ ధామ్ శివుని పన్నెండు జ్యోతిర్లింగాలలో అత్యంత ఎత్తులో ఉన్న క్షేత్రం. మహాభారత యుద్ధానంతరం పాండవులు తమ పాప పరిహారం కోసం శివుని వెతుక్కుంటూ వచ్చి ఇక్కడ ఆలయాన్ని నిర్మించారని ఐతిహ్యం. మందాకినీ నది ఒడ్డున కొలువై ఉన్న ఈ క్షేత్రం భక్తికి, పట్టుదలకు పరీక్షగా నిలుస్తుంది.

చివరగా భక్తులు బద్రీనాథ్‌కు చేరుకుంటారు. విష్ణుమూర్తి బద్రీనారాయణునిగా కొలువైన ఈ క్షేత్రం వైకుంఠ సమానంగా పరిగణించబడుతుంది. 'న భూతో న భవిష్యతి' అన్నట్లుగా బద్రీనాథ్ వంటి క్షేత్రం ముల్లోకాలలో లేదని పద్మ పురాణం కీర్తించింది. అలకనంద నది తీరాన ఉన్న ఈ ఆలయంలో ధ్యాన ముద్రలో ఉన్న విష్ణువును దర్శించడం ద్వారా యాత్ర పరిపూర్ణమవుతుంది. ఈ నాలుగు క్షేత్రాల సందర్శన అనేది ప్రకృతిలోని పంచభూతాలను, దైవత్వాన్ని ఏకకాలంలో అనుభవించే అవకాశం కల్పిస్తుంది.

గణాంకాల పరంగా చూస్తే, చార్ ధాం యాత్ర యొక్క ప్రజాదరణ ఏటా పెరుగుతూనే ఉంది. శీతాకాలంలో హిమాలయాలు మంచుతో కప్పబడి ఉండటం వల్ల ఏప్రిల్/మే నెలల్లో అక్షయ తృతీయ నాడు ఈ ఆలయాల తలుపులు తెరుచుకుంటాయి మరియు నవంబర్ మొదటి వారంలో దీపావళి తర్వాత మూసివేయబడతాయి. ఉత్తరాఖండ్ పర్యాటక శాఖ గణాంకాల ప్రకారం, 2022లో సుమారు 46 లక్షల మంది, 2023లో ఏకంగా 50 లక్షలకు పైగా యాత్రికులు ఈ క్షేత్రాలను సందర్శించి రికార్డు సృష్టించారు. 2024 మరియు తదుపరి సంవత్సరాల్లో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా. యాత్రికుల సంఖ్య పెరగడం అనేది ఒకవైపు ఆధ్యాత్మిక చైతన్యాన్ని సూచిస్తుండగా, మరోవైపు ఈ సున్నితమైన హిమాలయ పర్యావరణంపై పడుతున్న ఒత్తిడిని కూడా గుర్తుచేస్తోంది.

ఈ యాత్ర అనేక సవాళ్లతో కూడుకున్నది. 2013 జూన్ మాసంలో సంభవించిన కేదార్‌నాథ్ వరదలు ఒక తీరని జ్ఞాపకంగా మిగిలిపోయాయి. మేఘ విస్ఫోటనం కారణంగా పోటెత్తిన వరద నీరు వేలాది మంది ప్రాణాలను బలిగొనడమే కాకుండా, యాత్ర మౌలిక సదుపాయాలను ఛిన్నాభిన్నం చేసింది. ఆ విపత్తు తర్వాత ప్రభుత్వం మేల్కొని యాత్ర భద్రతలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చింది. ప్రస్తుతం 'చార్ ధాం ఆల్ వెదర్ రోడ్ ప్రాజెక్ట్' ద్వారా సుమారు 889 కిలోమీటర్ల పొడవైన రహదారిని అన్ని కాలాల్లో ప్రయాణానికి వీలుగా అభివృద్ధి చేస్తున్నారు. ఇది కేవలం ప్రయాణ సమయాన్ని తగ్గించడమే కాకుండా, ప్రమాదాల తీవ్రతను కూడా తగ్గిస్తుంది. దీనితో పాటు, రిజిస్ట్రేషన్ ప్రక్రియను డిజిటలైజ్ చేయడం, ప్రతి యాత్రికుడికి రియల్ టైమ్ ట్రాకింగ్ సౌకర్యం కల్పించడం వంటి చర్యలు భద్రతను మెరుగుపరిచాయి.

ఆర్థికంగా చార్ ధాం యాత్ర ఉత్తరాఖండ్ రాష్ట్రానికి వెన్నెముక వంటిది. ఈ ఆరు నెలల యాత్ర కాలంలోనే రాష్ట్ర జిడిపిలో గణనీయమైన భాగం పర్యాటక రంగం నుండి వస్తుంది. హోటల్ యజమానులు, రవాణా సంస్థలు, గుర్రాల యజమానులు, స్థానిక గైడ్‌లు మరియు చిరు వ్యాపారులకు ఇది ప్రధాన జీవనోపాధి. వేలాది కోట్ల రూపాయల ఆర్థిక లావాదేవీలు ఈ యాత్ర చుట్టూ తిరుగుతుంటాయి. అయితే, ఈ వాణిజ్యపరమైన ఎదుగుదల ప్రకృతి పర్యావరణానికి ముప్పు కాకూడదనే ఉద్దేశంతో 'పర్యావరణ అనుకూల యాత్ర' (జుఏశీ-టతీఱవఅస్త్రీఎ ఫ్తీఱ) పై చర్చలు జరుగుతున్నాయి. ప్లాస్టిక్ నియంత్రణ, చెత్త నిర్వహణ మరియు హిమాలయ గ్లేసియర్ల రక్షణ ఇప్పుడు అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశాలుగా మారాయి.

ఆధునిక సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో ఇప్పుడు యాత్ర స్వరూపం మారుతోంది. గతంలో కాలినడకన నెలల తరబడి సాగే ఈ ప్రయాణం, నేడు హెలికాప్టర్ సర్వీసుల ద్వారా నిమిషాల్లో ముగుస్తోంది. అయినప్పటికీ, భక్తులలో భక్తి భావం ఏమాత్రం తగ్గలేదు. కేదార్‌నాథ్ వెళ్ళే దారిలో 16 కిలోమీటర్ల కఠినమైన కొండ మార్గంలో నడిచే వృద్ధులు, వికలాంగులను చూస్తే భక్తి శక్తి ఏమిటో అర్థమవుతుంది. చలిని తట్టుకుంటూ, ఆక్సిజన్ తక్కువగా ఉండే ఎత్తైన ప్రదేశాలలో వారు ప్రదర్శించే పట్టుదల మానవ మనోబలానికి నిదర్శనం. యాత్రలో ఎదురయ్యే శారీరక కష్టం మనలోని అహంకారాన్ని కరిగించి, వినయాన్ని ప్రసాదిస్తుంది.

ముగింపుగా చెప్పాలంటే, చార్ ధాం యాత్ర అనేది కేవలం దర్శనీయ స్థలాల సందర్శన కాదు. అది భారతీయుల సాంస్కృతిక వారసత్వం, భక్తి వైరాగ్యాల సంగమం. హిమాలయాల శిఖరాల నుంచి ప్రవహించే నదులు, చలి గాలుల మధ్య వినిపించే 'ఓం నమః శివాయ' మరియు 'ఓం నమో నారాయణాయ' మంత్రోచ్చారణలు మనిషికి మానసిక ప్రశాంతతను అందిస్తాయి. ఆధునికత పెరుగుతున్న కొద్దీ యాత్ర సౌకర్యవంతంగా మారవచ్చు కానీ, ఆ హిమాలయాల పవిత్రత, భక్తుల ఆర్తి ఎప్పటికీ అలాగే ఉంటాయి. భవిష్యత్ తరాలకు ఈ ఆధ్యాత్మిక సంపదను అందించడం కోసం పర్యావరణాన్ని కాపాడుకుంటూ, ఈ పవిత్ర యజ్ఞాన్ని కొనసాగించవలసిన బాధ్యత మనందరిపై ఉంది. చార్ ధాం యాత్ర అంటే మనిషి తనను తాను తెలుసుకోవడం మరియు పరమాత్మలో లీనమవ్వడం కోసం చేసే ఒక మహోత్కృష్ట ప్రయత్నం. ఈ ప్రయాణం ముగిసే సమయానికి ప్రతి యాత్రికుడు తనతో పాటు కేవలం జ్ఞాపకాలను మాత్రమే కాదు, ఒక కొత్త దృక్పథాన్ని, ఆత్మవిశ్వాసాన్ని ఇంటికి తీసుకువెళతాడు.

# నటనకు జీవితాన్ని అంకితం చేసిన భాను ప్రకాష్

(రామ కిష్టయ్య సంగన భట్ల, 9440595494)

బాల్యం నుండే నటనపై ఆసక్తి కలిగి, చివరి శ్వాస వరకు నాటకం కోసమే జీవించిన కృషీవలుడు భానుప్రకాష్. నటనలో, దర్శకత్వం వహించడంలో, నటులను తీర్చి దిద్దడంలో భాను ప్రకాశ్ అందెవేసిన చేయిగా పేరొందాడు. భాను ప్రకాష్ (బొల్లంపల్లి భాను ప్రకాష్ రావు) (ఏప్రిల్ 21, 1939 - జూన్ 7, 2009) తెలంగాణ రాష్ట్ర ప్రముఖ రంగస్థల నటుడు, దర్శకుడు. భాను ప్రకాష్ 1939, ఏప్రిల్ 21న వెంకటహరి, అండాలమ్మ దంపతులకు నల్లగొండలో జన్మించాడు. హెచ్.ఎ.ఎల్.లో ఉద్యోగం చేసేవాడు.

ఆయన మేనమామ ధరణి శ్రీనివాసరావు నాటక రచయిత అవ్వడంవల్ల భాను ప్రకాష్ కేశవ్ మెమోరియల్ స్కూల్లో చదువుతున్న సమయంలో 11 ఏళ్ల వయస్సులోనే తొలిసారిగా వార్షికోత్సవాల సందర్భంగా స్టేజీపై తార్‌మార్ నాటకంలో నటించాడు. ప్రిన్సిపాల్ మొమెంటోతో ప్రశంసించడంతో నటనపట్ల తనలోని ఆసక్తిని పెంచుకున్న భాను ప్రకాష్ తమ కాలనీలోని మిత్రులతో కలిసి నాటకాలు రూపొందించి వినాయకచవితి మండపాల్లో ప్రదర్శించేవాడు. హైదరాబాదులో ఎస్.కె. ఆంజనేయులుకు చెందిన నాటక సంస్థ నిర్వహించే 'విస్మృతి' నాట్యమండలి నాటకాలు, రిహార్సల్స్‌ని చూసి తాను కూడా నాటక దర్శకత్వం చేయాలను కున్నాడు.

ఇంటర్ కాలేజీస్థాయి నాటక పోటీల్లో సైఫాబాద్ సైన్స్ కళాశాల నుండి స్వీయ దర్శకత్వంలో 'డాక్టర్ యజ్ఞం' నాటికలో డా. యజ్ఞం పాత్రలో నటించాడు. ఆ పోటీలో బహుమతులు రావడంతో దర్శకుడిగా తొలి ప్రయత్నంలోనే విజయం సాధించాడు. ఆ తరువాత 'గాలివాన', 'గుడిగంటలు', 'గాలిపటం', 'శ్రీమాన్ శ్రీమతి' వంటి నాటకాలలో నటిస్తూ, దర్శకత్వం వహించాడు. 1964లో 'యాచకులు'లో భాను ప్రకాష్ నటనకు మంచి గుర్తింపు వచ్చింది. 'కళారాధన' సంస్థను స్థాపించి 'వలయం', ' గాలివాన', ' కెరటాలు'




వంటి నాటకాలు ప్రదర్శించాడు. ఈ సంస్థను 'గ్రేట్ ఈస్ట్రన్ సర్కస్8 కంపెని' అని పిలిచేవారు. ఈ సంస్థ ద్వారా నటుడు నూతన్ ప్రసాద్ నాటకరంగానికి పరిచయ మయ్యాడు.

'చీకటి కోణాలు' నాటకంలో భాను ప్రకాష్ నటనను స్థానం నరసింహారావు అభినందించాడు. 'ఆకాశవాణి'లో కూడా ఆయన 'ఏ గ్రేడ్' ఆర్టిస్టుగా చాలా నాటకాల్లో పాల్గొన్నాడు. ఢిల్లీ, మద్రాస్, కలకత్తా, కాన్పూర్‌లలో నాటకాలను ప్రదర్శించాడు. 'చంద్రగుప్త', 'కన్యాశుల్కం', 'విశ్వశాంతి', 'సుడిగాలి', 'ఆపద్భాంధవులు', 'న్యాయం', 'పత్తర్ కె ఆంసూ', 'తాజ్ కీ ఛాయామే', 'గాలివాన ', 'జీవన్నాటకం', 'ఒంటి కాలి పురుగు', 'గాలి గోపురం', 'బాపూ బాటలో' వంటి నాటకాలు మంచి పేరు తెచ్చాయి. 'ప్రతిధ్వనులు', 'ప్రతిబింబాలు', 'వాన వెలిసింది', 'గాలిపటం', 'కాలం వెనక్కు వెళ్లింది' వంటి నాటికల్లో తన నటన ద్వారాను మంచిపేరు పొందాడు. ప్రధానంగా హైదరాబాదు రాష్ట్రంలో సాంఘిక నాటకానికి నాంది పలికాడు. భాను ప్రకాష్ నాటకాన్ని చూసిన నిర్మాత దుక్కిపాటి మధు సూదనరావు 1964లో డాక్టర్ చక్రవర్తి సినిమాలో చిన్న పాత్రను ఇచ్చాడు. ఆ తర్వాత పూలరంగడులో ఎలాంటి టెస్టు లేకుండానే పూర్తి నిడివిగల విలనీ పాత్రను ఇచ్చాడు.

డాక్టర్ చక్రవర్తి (1964), పూల రంగడు (1967), చదువుకున్న అమ్మాయిలు (1963), బుద్ధిమంతుడు, ఆత్మీయులు (1969), అమాయకురాలు (1971), విచిత్ర బంధం (1972), భక్త తుకారాం (1973), అన్నదమ్ముల అనుబంధం (1975), కల్పన (1977), అన్నదమ్ముల సవాల్ (1978), ముద్దుల కొడుకు, సీతే రాముడైతే (1979), పారిజాతం, శుభోదయం, అగ్ని సంస్కారం (1980), నా గురుశిష్యులు (1981), పెళ్లీడు పిల్లలు (1982), యుగ కర్తలు(1987), పల్లె పిలిచింది, రాధాకృష్ణ, చిల్లర దేవుళ్లు, దయామయుడు, శంకర్‌దాదా జిందాబాద్ (చివరి సినిమా) తదితర చిత్రాలలో విభిన్న పాత్రలు పోషించాడు.

50 ఏళ్లకు పైగా రంగస్థల, సినీ రంగాలకు ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా అనేక అవార్డులు, పురస్కారాలు లభించాయి. 'సుడిగాలి', 'గాలివాన', 'కెరటాలు' నాటకాలకు ఉత్తమ దర్శకుడిగా వరుసగా మూడుసార్లు ఎంపికై 'రోలింగ్ షీల్డ్' అందుకున్నాడు. 1972లో మరో రెండు బంగారు పతకాలను, 1974లో 'బళ్లారి రాఘవ' అవార్డుతో వెండి కిరీటం పొందాడు. 'యువ కళావాహిని' సంస్థ కె. వెంకటేశ్వరరావు అవార్డు, అవార్డు, తెలుగు విశ్వ విద్యాలయం ఉత్తమ నటుడి అవార్డు, 1992లో ఎ.ఆర్.కృష్ణ స్మారక పురస్కారం, 1998లో ఉగాది పురస్కారం, జూలూరు వీరేశలింగం అవార్డు, కిన్నెర ఉగాది పురస్కారం, రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక నందమూరి తారక రామారావు రంగస్థల పురస్కారం (2017) ఆయనకు లభించాయి. చివరి శ్వాస వరకు నాటకం కోసమే జీవించిన భాను ప్రకాష్ 2009, జూన్ 7 న తన 70వ యేట తనువు చాలించారు.



# సఫారీలదే రెండో టీ20

**డర్బన్:** మరో రెండు నెలల్లో మొదలుకానున్న మహిళల టీ20 ప్రపంచకప్‌నకు సన్నాహకంగా దక్షిణాఫ్రికాతో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భారత్‌కు వరుసగా రెండో పరాభవం ఎదురైంది. ఓటమితో సిరీస్‌ను ప్రారంభించిన ఉమెన్ ఇన్ బ్లూ.. ఆదివారం డర్బన్‌లో జరిగిన రెండో మ్యాచ్‌లోనూ విఫలమైంది. మ్యాచ్‌లో ప్రత్యర్థి ఆహ్వానం మేరకు ఫస్ట్ బ్యాటింగ్ చేసిన టీమ్‌ఇండియా.. నిర్ణీత ఓవర్లకు 147 రన్స్‌కే ఆలౌట్ అయింది. షెఫాలీ వర్మ (57), అనుష్క శర్మ (28) మినహా మిగిలిన బ్యాటర్లు తేలిపోయారు. సఫారీ బౌలర్లలో ట్రైయాన్ (3/22), సెకుకునె (3/31) భారత్‌ను కట్టడిచేశారు. స్వల్ప ఛేదనను సౌతాఫ్రికా అమ్మాయిలు 17.1 ఓవర్లలోనే దంచేశారు. కెప్టెన్ లారా వోల్వార్ట్ (54), సునె లుస్ (57) అర్ధ శతకాలతో తొలి వికెట్‌కు 106 రన్స్ జోడించారు. ఇరుజట్ల మధ్య మూడో టీ20 ఈనెల 22న జోహన్నెస్‌బెర్గ్‌లో జరుగుతుంది.

# ‘దిల్ చాహతా హై’

## అర్ష్‌దీప్ సింగ్ కు ప్రీతి జింటా హగ్.. స్టార్ పేసర్ ఖుషీ!



**లక్నో:** బాలీవుడ్ హీరోయిన్, పంజాబ్ కింగ్స్ ఫ్రాంచైజీ సహ యజమాని ప్రీతి జింటా గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఐపీఎల్‌లో పంజాబ్ జట్టును గెలిపించిన ఆటగాడికి ఓ హగ్ ఇస్తుంటారు. ఒకప్పుడు పంజాబ్ జట్టుకు ఆడిన యువరాజ్ సింగ్, క్రిస్ గేల్ లాంటి దిగ్గజాలకు సహా మరికొందరికి ప్రీతి హగ్ ఇచ్చారు. గతేడాది కూడా గెలుపు జోష్ లో చాలా మంది ఆటగాళ్లను ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. కాస్త బిజీగా ఉన్న ప్రీతి జింటా.. ఐపీఎల్ 2026లో మ్యాచ్‌లకు హాజరుకాలేదు. ఆదివారం లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌కు హాజరై సందడి చేశారు. లక్నోపై విజయం అనంతరం పంజాబ్ సహ యజమాని ప్రీతి జింటా మైదానంలోకి వచ్చి ఆటగాళ్లను అభినందించారు. ఈ క్రమంలో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌ను హగ్ చేసుకున్నారు. అర్ష్‌దీప్ ఆ క్షణాన్ని బాగా ఆస్వాదించాడు. ‘యాహూ.. ప్రీతి జింటా హగ్ ఇచ్చిందోచ్’ అంటూ ఎగిరి గంతేశాడు. దాంతో అక్కడ ఉన్నవారంతా ఆశ్చర్యపోయారు. ప్రీతి కూడా ఇదేంటి అన్నట్లు చూశారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ సన్నివేశం జట్టు సభ్యుల మధ్య ఉన్న బంధాన్ని, యజమాన్యం-ఆటగాళ్ల మధ్య ఉన్న అనుబంధాన్ని స్పష్టంగా చూపించింది. ఐపీఎల్ 2026లో పంజాబ్ కింగ్స్ జైత్రయాత్ర కొనసాగుతోంది. ఈ సీజన్లో ఓటమి ఎరుగని జట్టు పంజాబ్ మాత్రమే. లక్నోను ఓడించడం ద్వారా మరో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో అగ్ర స్థానంలో (11 పాయింట్స్) కొనసాగుతోంది. ఇదే ఊపుతో ముందుకు సాగాలని అభిమానులు కోరుకుంటున్నారు. ప్రీతి జింటా తన జట్టుకు అందించే మద్దతు, ఆటగాళ్లలో మరింత ఆత్మవిశ్వాసాన్ని నింపుతోందని ఈ వైరల్ వీడియో ద్వారా స్పష్టమైంది.

# తిలక్ వర్మ సుడిగాలి శతకం!

## గుజరాత్‌పై 99 పరుగుల తేడాతో ముంబై ఘన విజయం



- నరేంద్ర మోడీ స్టేడియంలో ఏకపక్షంగా సాగిన పోరు
- కేవలం 45 బంతుల్లోనే అజేయంగా 101 పరుగులు చేసిన తిలక్
- బంతితో చెలరేగిన అశ్వని కుమార్.. నాలుగు వికెట్లు కైవసం
- 100 పరుగులకే కుప్పకూలిన గుజరాత్ బ్యాటింగ్ లైనప్



**అహ్మదాబాద్, ఏప్రిల్ 20:** ఐపీఎల్ తాజా సీజన్ ముప్పైవ మ్యాచ్‌లో ముంబై జట్టు సమగ్ర ఆధిపత్యం చెలాయించింది. నరేంద్ర మోడీ స్టేడియంలో సోమవారం జరిగిన ఈ పోరులో గుజరాత్ జట్టుపై తొంభై తొమ్మిది పరుగుల భారీ తేడాతో ముంబై ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ముంబై జట్టు నిర్ణీత ఇరవై ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 199 పరుగులు చేసింది. తిలక్ వర్మ అద్భుత శతకంతో కదం తొక్కాడు. లక్ష్య ఛేదనలో గుజరాత్ బ్యాటర్లు పూర్తిగా చేతులెత్తేయడంతో ఆ జట్టు కేవలం 15.5 ఓవర్లలో సరిగ్గా వంద పరుగులకే ఆలౌట్ అయింది.

### ఆదుకున్న నమన్.. ఆకాశమే హద్దుగా తిలక్

టాస్ గెలిచిన గుజరాత్ కెప్టెన్ శుభమన్ గిల్ ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. బ్యాటింగ్ కు దిగిన ముంబైకి ఆరంభంలోనే సవాళ్లు ఎదురయ్యాయి. స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ పది బంతుల్లో పదిహేను పరుగులు చేసి అవుట్ కాగా, ఇతర టాపార్డర్ బ్యాటర్లు కూడా భారీ స్కోర్లు చేయలేకపోయారు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన తిలక్ వర్మ, నమన్ ధీర్ తో కలిసి ఇన్నింగ్స్ ను చక్కదిద్దాడు. నమన్ ధీర్ 32 బంతుల్లో 45 పరుగులు చేసి అద్భుతమైన సహకారం అందించాడు. అతడు అవుటైన తర్వాత తిలక్ వర్మ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. గుజరాత్ బౌలర్లపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతూ కేవలం 45 బంతుల్లోనే అజేయంగా 101 పరుగులు సాధించాడు. దీంతో ముంబై భారీ స్కోరు సాధించగలిగింది. గుజరాత్ బౌలర్లలో కగిసో రబాడ నాలుగు ఓవర్లలో 33 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు పడగొట్టాడు. మహ్మద్ సిరాజ్ కు ఒక వికెట్, ప్రసిద్ధ్ కృష్ణకు ఒక వికెట్ దక్కాయి. ప్రసిద్ధ్ కృష్ణ నాలుగు ఓవర్లలో ఏకంగా 54 పరుగులు సమర్పించుకోవడం గమనార్హం.

### పేర్చిన పేకమేడలా గుజరాత్ ఇన్నింగ్స్

రెండు వందల పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్ జట్టు ఏ దశలోనూ విజయం దిశగా సాగలేదు. ముంబై బౌలర్ల కట్టుదిట్టమైన బంతులకు గుజరాత్ బ్యాటర్లు క్రీజులో నిలవలేకపోయారు. వాషింగ్టన్ సుందర్ 17 బంతుల్లో 26 పరుగులతో టాప్ స్కోరర్ గా నిలవడం ఆ జట్టు బ్యాటింగ్ వైఫల్యానికి అద్దం పడుతోంది. షారుఖ్ ఖాన్ 13 బంతుల్లో 17 పరుగులు, కెప్టెన్ శుభమన్ గిల్ 13 బంతుల్లో 14 పరుగులు మాత్రమే చేసి తీవ్రంగా నిరాశపరిచారు. మిగతా బ్యాటర్లంతా సింగిల్ డిజిట్ కే పరిమితం కావడంతో ఇన్నింగ్స్ పేర్చిన పేకమేడలా కుప్పకూలింది.

### అశ్వని కుమార్ అద్భుత స్పెల్

ముంబై బౌలర్లలో అశ్వని కుమార్ అద్భుత ప్రదర్శనతో గుజరాత్ పతనాన్ని శాసించాడు. నాలుగు ఓవర్లలో కేవలం 24 పరుగులు మాత్రమే ఇచ్చి ఏకంగా నాలుగు వికెట్లు పడగొట్టాడు. స్పిన్నర్ మిచెల్ సాంట్నర్ మూడు ఓవర్లలో 16 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు తీశాడు. అల్లా గజన్ఫర్ 2.5 ఓవర్లు బౌలింగ్ చేసి 17 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. ఏకపక్షంగా సాగిన ఈ మ్యాచ్ లో అద్భుత శతకంతో ముంబై విజయానికి బాటలు వేసిన తిలక్ వర్మకు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది.





# కెనడా కెప్టెన్‌పై మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలు

### ఐసీసీ నజర్‌లో దిల్‌ప్రీత్ బజ్వా

**ముంబై :** ఇటీవల వరల్డ్‌కప్‌లో ఆడిన కెనడా జట్టు టీ20 కెప్టెన్ దిల్‌ప్రీత్ బజ్వా(ణఅశ్రీజూతీవవ్ దీఖయిఖ)పై మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలు వచ్చాయి. అంతర్జాతీయ క్రికెట్ మండలికి చెందిన అవినీతి నిరోధక యూనిట్ ఆ ఆరోపణలపై దర్యాప్తు చేపడుతున్నది. టీ20 వరల్డ్‌కప్ సమయంలో న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో దిల్‌ప్రీత్ ఫిక్సింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. పంజాబ్‌లోని బాటాలాలో జన్మించాడు దిల్‌ప్రీత్. అతని వయసు 24 ఏళ్లు. వరల్డ్‌కప్‌లో అతని ఆటతీరుపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కెనడా, న్యూజిలాండ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌పై ఏసీయూ దర్యాప్తు చేపడుతోంది. ఈ ఏడాది ఫిబ్రవరి 17వ తేదీన ఆ మ్యాచ్ జరిగింది. న్యూజిలాండ్ 174 రన్స్ చేజింగ్ చేస్తున్న సమయంలో 35-2 స్కోరు వద్ద అకస్మాత్తుగా దిల్‌ప్రీత్ బజ్వా బౌలింగ్ చేశాడు. అతను తన తొలి ఓవర్‌లో నోబ్‌లు, వైడ్‌లు వేశాడు. మొత్తం 15 రన్స్ ఇచ్చాడు. కానీ అనూహ్యంగా అతను బౌలింగ్ చేయడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మ్యాచ్ కీలక దశలో ఉన్నప్పుడు బజ్వా బౌలింగ్ చేసినట్లు తెలుస్తోంది. దీనిపై ఏసీయూ అనుమానాలు వ్యక్తం చేస్తున్నది. స్పాట్ ఫిక్సింగ్‌కు పాల్పడిన బౌలర్లు.. కావాలని నోబ్ లేదా వైడ్ వేసే అవకాశాలు ఉంటాయి. ఆ కోణంలో బజ్వాపై విచారణ జరగనున్నది. ఇటీవల కెనడా టీవీలో ఓ డాక్యుమెంటరీ ప్రసారమైంది. కరప్షన్, క్రైం, క్రికెట్ అన్న టైటిల్‌తో ఆ డాక్యుమెంటరీ ప్రజెంట్ చేశారు. టీం సెలెక్షన్‌తో పాటు బజ్వాను కెప్టెన్‌గా ఎంపిక చేయడం పట్ల అనుమానాలు వ్యక్తం చేశారు. కివీస్‌తో జరిగిన మ్యాచ్‌లో కెనడా ఓటమి పాలైంది. కానీ ఆ మ్యాచ్‌లో బెట్టింగ్ లాంటి ఆరోపణలను కూడా ఏసీయూ దర్యాప్తు చేయనున్నది. ఫోన్, కమ్యూనికేషన్ రికార్డులను పరిశీలిస్తారు. ప్రస్తుతం ఆ క్రికెటర్‌పై ఎటువంటి అభియోగాలు నమోదు కాలేదు. కానీ అతని వ్యవహార శైలిపై అనుమానాలు రావడంతో దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిసింది. పంజాబ్ దేశవాళీ క్రికెట్‌లో చోటు దక్కకపోవడంతో గురుదాస్‌పూర్‌కు చెందిన దిల్‌ప్రీత్ బజ్వా 2020లో కెనడా వెళ్లాడు. గ్లోబల్ టీ20 కెనడా లీగ్‌లో అతను పేరు సంపాదించుకున్నాడు. మాంట్రియల్ టైగర్స్ తరపున ఆడిన అతను ఓ సెంచరీ కొట్టి అందరి దృష్టిలో పడ్డాడు. 2026లో కెనడా జాతీయ క్రికెట్ జట్టుకు కెప్టెన్ అయ్యాడు. జాతీయ క్రికెట్ జట్టుకు కెప్టెన్‌గా బాధ్యతలు స్వీకరించిన తొలి సిక్కుగా రికార్డు క్రియేట్ చేశాడు. అయితే కెనడా ఇంటెలిజెన్స్ ప్రకారం క్రికెట్ బెట్టింగ్, ఫిక్సింగ్‌లో లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ పాత్ర ఉన్నట్లు అనుమానిస్తున్నారు. కెనడాలోని సర్రే, బ్రిటీష్ కొలంబియా జట్ల ఆటగాళ్లను బిష్ణోయ్ గ్యాంగ్ బెదిరించినట్లు తెలుస్తోంది. కావాలని నోబ్, వైడ్ వేసినట్లు అనుమానాలు వ్యక్తం కావడంతో ప్రస్తుతం బజ్వాను ఐసీసీ విచారిస్తున్నది. అతని ఫోన్‌ను సీజ్ చేసింది. డెల్టా, బీసీ, ఆర్సీఎంపీ రాష్ట్రాలకు చెందిన కెనడా పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు. బెదిరింపులు, కాల్పుల ఘటనలకు లింకులు ఉన్నట్లు అనుమానిస్తున్నారు. కెనడా పోలీసులు, కెనడా క్రికెట్ ప్రకారం మాత్రం బజ్వాపై ఇంకా ఎటువంటి నేరం రుజువుకాలేదు.



# చీరకట్టులో కేరళ కుట్టి

**న్యూ లుక్‌తో సోషల్ మీడియాలో అనిఖా హల్‌చల్**



కేరళకు చెందిన యువ నటి అనిఖా సురేంద్రన్ తన తాజా ఫోటోషూట్‌తో మరోసారి అభిమానులను ఆకట్టుకుంటోంది. సంప్రదాయ శైలిలో తీసిన ఈ ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతున్నాయి. తాజాగా విడుదలైన చిత్రాల్లో అనిఖా గోల్డెన్ ఆర్గాంజా చీరలో సిల్వర్ డిజైన్స్‌తో మెరిసిపోతూ కనిపించింది. దీనికి జతగా ఆమె ధరించిన డీప్ రెడ్ ప్రింటెడ్ బ్లౌజ్ లుక్‌కు మరింత ఆకర్షణను తెచ్చింది. సంప్రదాయ అందాన్ని హైలైట్ చేస్తూ ఆమె పెద్ద సిల్వర్ ఆక్సిడైజ్డ్ చెవిపోగులు, రంగురంగుల గాజులు, సింపుల్ బొట్టు ధరించి సహజమైన గ్లామర్‌ను ప్రదర్శించింది. ప్రకృతి మధ్యలో తీసిన ఈ ఫోటోలు ఆమె చిరునవ్వుతో మరింత అందంగా మారాయి. బాలనటిగా సినీ ప్రయాణాన్ని ప్రారంభించిన అనిఖా, ఇప్పుడు హీరోయిన్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటోంది. గ్లామర్‌తో పాటు నటనలోనూ మెప్పిస్తున్న ఆమె, కొత్త లుక్‌తో మరోసారి అభిమానుల దృష్టిని ఆకర్షించింది.






# దెయ్యాలనూ భయపెట్టించే ఓం శాంతి డిస్కో శాంతి

టాలీవుడ్‌లో వినూత్న కథలతో గుర్తింపు పొందిన దర్శకుడు మహి వి. రాఘవ్ మరోసారి ప్రేక్షకులను ఆశ్చర్యపరిచే ప్రయత్నంలో ఉన్నారు. ఆయన దర్శకత్వంలో రూపొందుతున్న తాజా చిత్రం 'ఓం శాంతి డిస్కో శాంతి' అనే టైటిల్‌తోనే ఆసక్తిని రేపుతోంది. హారర్ కామెడీ జానర్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమా కాన్సెప్ట్ పూర్తిగా భిన్నంగా ఉండబోతోందని సమాచారం. సాధారణంగా దెయ్యాలు మనుషులను భయపెడతాయి. కానీ ఈ సినిమాలో పరిస్థితి పూర్తిగా రివర్స్‌గా ఉండనుంది. భయం అంటే ఏంటో తెలియని కొంతమంది వ్యక్తులు దెయ్యాలను ఎదుర్కొంటే ఏమవుతుంది? ఆ పరిణామాల్లో దెయ్యాలకే భయం పుడుతుందా? అనే వినూత్న ఆలోచనతో ఈ సినిమా రూపొందుతోంది. తాజాగా విడుదలైన మోషన్ పోస్టర్ సోషల్ మీడియాలో మంచి స్పందన తెచ్చుకుంది. "ఆల్ రెడీ కాషన్ కియా.. ఆల్ రెడీ" అనే క్యాప్షన్ సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచింది. ఈ చిత్రంలో జంప్ స్కేర్లు, కామెడీ సీన్లు, అనూహ్య ట్విస్టులతో కూడిన వినోదభరిత కథనం ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. ప్రేక్షకులకు పూర్తిగా కొత్త అనుభూతిని ఇవ్వడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్ట్ రూపొందుతోంది. సెప్టెంబర్ నెలలో ఈ సినిమాను థియేటర్లలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. కథ, స్క్రీన్‌ప్లే అందిస్తున్న మహి వి. రాఘవ్ షో రన్నర్‌గా వ్యవహరిస్తుండగా, దర్శకత్వ బాధ్యతలను గోగు ఆర్.ఆర్ నిర్వహిస్తున్నారు. మొత్తానికి, హారర్ కామెడీ జానర్‌లో మరోసారి తనదైన ముద్ర వేయడానికి మహి వి. రాఘవ్ సిద్ధమవుతున్నారని సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# టాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్న వామికా గబ్బి

బాలీవుడ్‌లో తన నటనతో గుర్తింపు తెచ్చుకున్న నటి వామికా గబ్బి ఇప్పుడు టాలీవుడ్ వైపు దృష్టి సారిస్తోంది. ఇటీవల ఆమె నటించిన హిందీ చిత్రం ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోయినా, దానిని పక్కన పెట్టి కొత్త అవకాశాలపై ఫోకస్ పెట్టింది. ప్రస్తుతం వామికా టాలీవుడ్‌లో భారీ ప్రాజెక్ట్‌గా భావిస్తున్న '+2' చిత్రంలో కీలక పాత్రలో నటిస్తోంది. ఈ సినిమాలో ఆమె చేరికపై ఇప్పటికే మంచి ఆసక్తి నెలకొంది. తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువ కావడానికి ఈ సినిమా ఆమెకు మంచి వేదికగా మారనుంది. ఇక భిన్న భాషా చిత్రాల్లోనూ అవకాశాలు అందుకుంటూ, వామికా తన కెరీర్‌ను విస్తరించుకుంటోంది. స్టైలిష్ లుక్స్‌తో పాటు నటనపరంగా కూడా గుర్తింపు తెచ్చుకుంటున్న ఆమె, టాలీవుడ్‌లో తనదైన ముద్ర వేయడానికి సిద్ధమవుతోంది.

# పెద్దిలో స్పెషల్ సాంగ్ కోసం సంయుక్త మీనన్



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ 'పెద్ది'. ఈ సినిమా అనౌన్స్ చేసినప్పటి నుండి దీనిపై అంచనాలు ఆకాశాన్ని తాకాయి. తాజాగా ఈ సినిమా గురించి ఒక క్రేజీ అప్‌డేట్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఈ సినిమాలో ఒక ప్రత్యేక గీతం కోసం 'గోల్డెన్ లెగ్' సంయుక్త మీనన్‌ను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. రామ్ చరణ్ సినిమాల్లో పాటలు, ముఖ్యంగా మాస్ సాంగ్స్ ఏ రేంజ్‌లో ఉంటాయో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. 'పెద్ది' కోసం ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ అదిరిపోయే ట్యూన్ సిద్ధం చేశారని సమాచారం. ఈ మాస్ నంబర్‌లో రామ్ చరణ్ సరసన సంయుక్త మీనన్ ఆడిపాడనుందనే వార్త ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్ అయ్యింది. సంయుక్త తొలిసారిగా అఖండ 2 లో బాలయ్య సరసన జాజికాయ అనే స్పెషల్ సాంగ్ లో నటించి మెప్పించింది. ఇప్పుడు మరోసారి స్పెషల్ సాంగ్‌లో మెగా హీరోతో స్క్రీన్ షేర్ చేసుకోవడం విశేషం. అయితే ఈ స్పెషల్ సాంగ్ లో చరణ్ సరసన మానస వారణాసి, మృణాల్ ఠాకూర్, పూజాహెగ్డే వంటి భామల పేర్లు వినిపించాయి కానీ చివరికి సంయుక్తకు డైరెక్టర్ బుచ్చిబాబు గ్రీన్ సిగ్నల్ ఇసినట్టు తెలుస్తోంది. ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే స్పోర్ట్స్ డ్రామాగా 'పెద్ది' రూపొందుతోంది. ఇందులో రామ్ చరణ్ మునుపెన్నడూ లేని విధంగా ఒక కొత్త లుక్‌లో కనిపించబోతున్నారు. ఇప్పటికే జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, ఇప్పుడు సంయుక్త మీనన్ స్పెషల్ అట్రాక్షన్‌గా నిలవనుంది. ఈ స్పెషల్ సాంగ్ సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని, బాక్సాఫీస్ వద్ద రికార్డులు తిరగరాయడం ఖాయమని ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు.

# బాబుమోహన్‌కు రేలంగి అవార్డు



హాస్యనటచక్రవర్తి పద్మశ్రీ రేలంగి అవార్డును నటుడు డా.బాబుమోహన్ అందుకున్నారు. 41ఏండ్ల నటజీవితాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా తెలుగు ఫిల్మ్ టెలివిజన్ వెల్ఫేర్ ఫార్మ్ అండ్ భారత్ కల్చరల్ అకాడమీ సంస్థ ఆయనకు ఈ అవార్డును అందజేసింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాతల మండలి కార్యదర్శి టి.ప్రసన్నకుమార్, నాగబాల సురేశ్, నటుడు రాంకీ, 30ఇయర్స్ పృథ్వీరాజ్ తదితరులు అతిథులుగా పాల్గొని తెలుగు సినిమాకు బాబుమోహన్ చేసిన సేవలను కొనియాడారు. ఆయనతో తమ అనుభవాలను గుర్తుచేసుకున్నారు. బాబుమోహన్ మాట్లాడుతూ 'రేలంగి అవార్డు అందుకోవడం ఆనందంగా ఉంది. ఈ 41ఏండ్ల నట జీవితంలో నన్ను పోత్సహించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరున ధన్యవాదాలు తెలుపుతున్నాను. అవార్డుల కంటే ప్రజల ఆశీస్సులే గొప్ప దీవెన. ఇక 'పద్మ' అవార్డు వస్తే సంతోషం. రాకపోయినా ఫర్వాలేదు' అని బాబుమోహన్ అన్నారు.

# పెద్ద మనసు చాటుకున్న చిరంజీవి



ప్రముఖ నటుడు చిరంజీవి మరోసారి పెద్ద మనసు చాటుకున్నారు. ఆపదలో ఉన్న తన సిబ్బందిని ఆర్థిక సాయంతో ఆదుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి నేనున్నానంటూ భరోసా ఇచ్చారు. మేకప్ ఆర్టిస్ట్ శివనాథ్ హార్ట్ సర్జరీ కోసం రూ. 10.5 లక్షలు, మాజీ మేనేజర్ నరసయ్య సతీమణి బైపాస్ సర్జరీకి రూ. 9.5 లక్షలు అందజేశారు. సాయం చేయడమే కాదు శస్త్ర చికిత్సల ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించి, ఆ కుటుంబాలకు అండగా నిలిచారు.

PRINTED, PUBLISHED AND OWNED BY **MOHAMMED IMRAN**, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. **EDITOR : MOHAMMED IMRAN**, RNI. NO. **TELTEL/2006/16536**